





www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం
13-06-2024

సంపుటి : 01 | సంచిక : 40 | పేజీలు : 12 | వెల : 5/-

తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# బాబు ఈజ్ బ్యాక్


## ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం

నారా చంద్రబాబు నాయుడు అనే నేను అంటూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాబు ప్రమాణ స్వీకారం చేశారు. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని, భయం కానీ, పక్షపాతం కానీ, రాగద్వేషాలు కానీ లేకుండా... రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి ప్రజలందరికీ న్యాయం చేకూర్చుతానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అంటూ ప్రమాణం బాబు ఆచరించారు.



- కేసరపల్లిలో అట్టహాసంగా కార్యక్రమం
- 24 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం
- మార్మోగిన సభా ప్రాంగణం
- హాజరైన మోడీ, షా, వెంకయ్యతో పాటు పలువురు ప్రముఖులు
- నేడు సీఎంగా సచివాలయంలో బాధ్యతలు
- తొలి సంతకంపై సర్వత్రా ఆసక్తి

10



మిగతా ఫొటోలు 03లో..

## ఒడిశా సీఎంగా మోహన్ చరణ్ ప్రమాణం

- రాష్ట్రానికి 15వ ముఖ్యమంత్రిగా బాధ్యతలు
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు
- ఒడిశాలో బీజేడీని చిత్తుగా ఓడించిన బీజేపీ
- రెండున్నర దశాబ్దాల పాలనకు ముగింపు



9

## కొత్త బీరు v/s పాత బీరు

### తెలంగాణలో బీర్ల యుద్ధం





**గతంలో ఎప్పుడూ లేని పంచాయితీ**

- కింగ్ ఫిషర్ బీర్లను బ్లాక్ చేసిన ప్రభుత్వం
- సరఫరా తగ్గించేసిన బీర్ల ఉత్పత్తి కంపెనీలు
- కొత్త బ్రాండ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన బ్రూవరీస్
- రాష్ట్ర వ్యాప్తంగా కొత్తబీర్లపై తీవ్ర వ్యతిరేకత
- పునరాలోచనలో పడ్డ తెలంగాణ ప్రభుత్వం
- బీర్ల కంపెనీలు వేల కోట్లు బకాయిపడ్డ సర్కార్



**విశ్వంభర, హైదరాబాద్:**

గతంలో ఎప్పుడూ లేనట్లుగా తెలంగాణాలో బీర్ల యుద్ధం జరుగుతోంది. తెలంగాణాలో ఇప్పటికే బీర్ల ఉత్పత్తి కంపెనీలు(బ్రూవరీలు) బీర్ల తయారు చేయటానికి సిద్ధపడిన కొత్త కంపెనీలకు మధ్య యుద్ధం నడుస్తోంది. అయితే కంపెనీలు తమ మధ్య వివాదాలను తేల్చుకోకుండా మధ్యలో మీడియాను కూడా లాగాయి. ఎలాగంటే బీర్ల తయారీకి కొత్తగా రెడీ అయిన కంపెనీలపై పాత కంపెనీలు నెగిటివ్ ప్రచారం చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దాంతో కొత్త కంపెనీలు కూడా పాత కంపెనీలపై ఇదే విధమైన యుద్ధానికి తెరలేపాయి. ఈ మొత్తంలో ఏమిచేయాలో అర్థంకాక ప్రభుత్వం తలపట్టుకుంది.

**బీర్ల కంపెనీలు వేల కోట్లు బకాయిపడ్డ సర్కార్**

ఇంతకీ విషయం ఏమిటంటే తెలంగాణలో 6 బ్రూవరీస్ బీర్లు తయారుచేస్తున్నాయి. అన్నీ కంపెనీలు కలిపి నెలకు సుమారు 70 లక్షల కేసులు ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిలో యూబీ కంపెనీ తయారుచేస్తున్న కింగ్ ఫిషర్ బీర్లలో కింగ్ ఫిషర్ లైట్ అనే బ్రాండ్ చాలా పాపులర్. 6 బ్రూవరీలు కలిపి 70 రకాల బ్రాండ్లతో బీర్లను తయారుచేస్తున్నాయి. వీటన్నింటిలో కింగ్ ఫిషర్ లైట్ బ్రాండ్ వాటా సుమారు 20 శాతం.

మిగతా10లో...

## కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం

- 49 మంది మృతి.. 50 మందికి గాయాలు
- ప్రమాదంలో 40 మంది భారతీయుల సజీవ దహనం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని

9

## మల్లారెడ్డికి షాక్

- భూ వివాదం కేసులో పురోగతి
- సుచిత్రలో 33 గంటల భూమి మల్లారెడ్డిది కాదు
- తేల్చిసిన రెవెన్యూ అధికారులు
- సర్వే రిపోర్ట్ కోర్టుకు సమర్పించిన అధికారులు



2



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 135 | ₹ 162 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹235 | ₹ 267 |

## టెట్ ఫలితాలు విడుదల



- ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్
- పేపర్-1లో 67 శాతం.. పేపర్-2లో 34 శాతం అభ్యర్థులు అర్హత
- మే 20 నుంచి జూన్ 2 వరకు పరీక్షలు నిర్వహణ
- మొదటి సారిగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు
- జూన్ 20 వరకు డీఎస్సీ దరఖాస్తుకు అవకాశం

2

## భారత్‌లో నాలుగేళ్ల చిన్నారికి బర్డ్ ఫ్లూ

2

## తెలంగాణలో మోడీ పాలన తెస్తాం

2

# యెడియూరప్పకు నోటీసులు

- ఫోక్సో కేసులో సీఐడీ నోటీసులు జారీ
- బుధవారం విచారణకు హాజరు కావాలని ఆదేశం



**విశ్వంభర, బెంగళూరు:** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు యెడియూరప్పకు పోక్సో కేసులో బుధవారం విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసులు జారీ చేసింది. యెడియూరప్ప ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారని, బెంగళూరు రాగానే సీఐడీ ముందు విచారణకు హాజరవుతారని ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ 17 ఏండ్ల బాలిక పట్ల యెడియూరప్ప అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధిత బాలిక తల్లి మార్చి 14వ తేదీన సదాశివనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ కేసును సీఐడీకి అప్పగిస్తూ కర్ణాటక డీజీపీ అలోక్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో యెడియూరప్పకు నోటీసులు జారీ అయ్యాయి. తాను ఎవర్నీ కూడా లైంగికంగా వేధించలేదని, ఈ కేసు విషయంలో న్యాయ పోరాటం చేస్తానని యెడియూరప్ప గతంలో ప్రకటించారు. ఇక ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధితురాలి తల్లి ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత నెలలో చనిపోయారు. ఈ కేసులో బాధితురాలితో పాటు ఆమె తల్లి వాంగ్మూలాన్ని సీఐడీ అధికారులు నమోదు చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే
# నాణ్యమైన విద్య

- తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి
- ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- ఎంపీ కడియం కావ్య



**విశ్వంభర, హనుమకొండ టౌన్:** స్టేషన్ ఘనపూర్ మండలం చాగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడి బాట స్వాగత దినోత్సవ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలందరిని బడి బాట పట్టించాలి అని, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుంది అని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నారు అన్నారు. పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశాం అని, త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు చేయబోతుంది ప్రభుత్వం అని తెలిపారు. విద్యా రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్ట బోతున్నామని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఊధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఎంపీగా ఎన్నికైన తర్వాత మొదటి కార్యక్రమం బడి బాట కార్యక్రమం కావడం చాలా అదృష్టంగా బావిస్తున్నాను అని అన్నారు. కడియం ఫౌండేషన్ ద్వారా బ్యాక్ టు స్కూల్ కార్యక్రమాన్ని నిర్వహించం అని, ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది అని, విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను రూపొందుతున్నాయి అని, విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాము, సీడీపీఓ ఫ్లోరెన్స్, ఎంపీడీఓ కృష్ణవేణి, ఏసిపి భీమ్ శర్మ, ఏఎంఓ శ్రీనివాస్, ఎమ్మార్వో వెంకటేష్, జడ్పీటీసీ మారుపాక రవి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రి వైద్యంపై
# నమ్మకం కలగాలి
## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**విశ్వంభర, మోమిన్ పేట్:** ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యంపై నమ్మకం కలిగేలా వైద్య సిబ్బంది విధులు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండల కేంద్రంలో ఒక కోటి యాభై ఆరు లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ సునీత మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. పేద ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించుకోలేరని, వారికి మెరుగైన వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే లభించేలా వైద్య సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి ఒక రూపాయి ఖర్చు లేకుండా పేద ప్రజలకు వైద్యం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు దృష్టి సారించాలన్నారు. మోమిన్ పేట మండలంలో 43,667 మంది జనాభా ఉన్నారని, వారు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించుకోవడానికి వీలు ఉంటుందని తెలిపారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందించేలా ప్రతి వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వాసు చంద్ర, డీఎంహెచ్వో పవన్ కుమార్, ఆసుపత్రి డాక్టర్ సుజల, తాసిల్దార్ మనోహర చక్రవర్తి, పి ఆర్ ఈ ఈ ఉమేష్ కుమార్, ఎంపీపీ వసంత, మాజీ మార్కెట్ చైర్మన్ నరోత్తం రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టెట్ ఫలితాలు విడుదల

- ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్
- పేపర్-1లో 67 శాతం.. పేపర్-2లో 34 శాతం అభ్యర్థులు అర్హత
- మే 20 నుంచి జూన్ 2 వరకు పరీక్షలు నిర్వహణ
- మొదటి సారిగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు
- జూన్ 20 వరకు డీఎస్సీ దరఖాస్తుకు అవకాశం




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. పరీక్షలు పూర్తయిన పది రోజుల్లోనే టెట్ ఫలితాలను విడుదల చేయడం విశేషం. అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ జర్నల్ నెంబరు, హాల్‌టికెట్ నెంబరు, పుట్టినతేదీ వివరాలు నమోదు చేసి ఫలితాలు చూసుకోవచ్చు. టెట్ 2024 ఫలితాలకు సంబంధించి మొత్తం 2,86,381 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పేపర్ 1పరీక్షకు 85,996 అభ్యర్థులు హాజరు కాగా.. 57,725 అభ్యర్థులు అర్హత సాధించారు. ఇక పేపర్2 పరీక్షకు 1,50,491 అభ్యర్థులు హాజరు కాగా.. 51,443 అభ్యర్థులు అర్హత సాధించారు.

**పేపర్-1లో అర్హత సాధించిన వారు 67 శాతం**

పేపర్1లో అర్హత సాధించిన వారు 67.13% అర్హత నమోదుకాగా.. పేపర్2లో 34.18 శాతం అభ్యర్థులు అర్హత సాధించారు. టెట్ 2023 ఫలితాలతో పోల్చితే పేపర్1లో 30.24 శాతం, పేపర్2లో 18.88 శాతం అర్హత పెరగడం గమనార్హం. టెట్ 2024లో అర్హత సాధించలేకపోయిన అభ్యర్థులకు వచ్చే టెట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకునే వెలుసుబాటును ప్రభుత్వం కల్పించింది. అదేవిధంగా టెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఒకసారి ఉచితంగా డీఎస్సీ దరఖాస్తు చేసుకునే వెసులుబాటును రేవంత్ సర్కార్ కల్పించింది. రాష్ట్రంలో మే 20 నుంచి జూన 2 వరకు టెట్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మొదటి సారిగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 జిల్లా కేంద్రాల్లో టెట్ పరీక్షలు నిర్వహించారు. టెట్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని జూన్ 3న అధికారులు విడుదల చేశారు. దానిపై అభ్యంతరాలు స్వీకరించి తుది ఆన్సర్ కీని రూపొందించింది. జూన్ 12న ఫైనల్ ఆన్సర్ కీతోపాటు ఫలితాలను వెల్లడించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

**అర్హత మార్కులు..**

టెట్ పరీక్షలకు సంబంధించి 150 మార్కులకు పేపర్ 1, 150 మార్కులకు పేపర్2 నిర్వహించారు. ఒక్కో పేపరులో 150 ప్రశ్నలు ఉంటాయి. పేపర్1లో 5 విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగంలో 30 ప్రశ్నలు 30 మార్కులు కేటాయించారు. ఇక పేపర్1లో 4 విభాగాలు ఉంటాయి. వీటిలో మొదటి మూడు విభాగాల్లో 30 ప్రశ్నలు 30 మార్కులు, నాలుగో విభాగానికి 60 ప్రశ్నలు 60 మార్కులు కేటాయించారు. పరీక్షల్లో అర్హత మార్కులను 60 శాతం, బీసీలకు 50 శాతం, ఎస్సీఎస్టీదివ్యాంగులకు 40 శాతంగా నిర్ణయించారు.

**జూన్ 20 వరకు డీఎస్సీ దరఖాస్తుకు అవకాశం**

తెలంగాణలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ-2024 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. డీఎస్సీ దరఖాస్తు ప్రక్రియ మార్చి 4న ప్రారంభంకాగా... జూన్ 20తో గడువు ముగియనుంది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జులై 17 నుంచి 31 వరకు టీఎస్ డీఎస్సీ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. అయితే డీఎస్సీకి కూడా ఇప్పటి వరకూ పెద్దగా దరఖాస్తులు రాలేదు. పోస్టులు పెరిగినా కొత్తగా వచ్చిన దరఖాస్తులు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. దీనికి కొత్తగా 37,700 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గతేడాది 5,089 పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ కోసం 1.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. దీంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 2.14 లక్షల మంది వరకు దరఖాస్తులు సమర్పించారు ఫలితాలు వెలువడడంతో.. డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకునేవారిక సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# మల్లారెడ్డికి షాక్



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి బిగ్ షాక్ తగిలింది. సుచిత్ర పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 82లో ఉన్న ల్యాండ్ 33 గుంటల స్థలం మల్లారెడ్డి కాదని రెవిన్యూ అధికారులు తేల్చారు. ఈ మేరకు బుధవారం హైకోర్టుకు రెవెన్యూ అధికారులు నివేదిక అందజేశారు. సైబరాబాద్ పోలీసులకు సర్వే రిపోర్ట్‌ను పంపించారు. సర్వే నెంబర్ 82లో ఉన్న ల్యాండ్ పై 15 బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్వే చేపట్టిన రెవిన్యూ అధికారులు.. ఆ భూమిని మల్లారెడ్డి కబ్జా చేసినట్లు తేల్చారు.

**తనదే అని పట్టుబడిని మల్లారెడ్డి!**

సుచిత్ర పరిధిలోని సర్వే నెంబర్ 82లో ఉన్న రెండున్నరెకరాల భూమి తమదేనని మల్లారెడ్డి అంటున్నారు. అయితే అందులో 1.11 ఎకరాలు తమదేనని, తలా 400 గజాలు కొన్నామని, కోర్టు తీర్పు తమకే అనుకూలంగా వచ్చిందని పదిహేను మంది వ్యక్తులు ఫెన్సింగ్ వేసుకున్నారు. ఈ ఫెన్సింగ్‌ను మల్లారెడ్డి తన అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డితో వచ్చి మే 19వ తేదీన తొలగించారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో పోలీసులు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఇరు వర్గాలకు సూచించారు. కానీ మల్లారెడ్డి కేసులు పెట్టుకుంటే పెట్టుకోవాలని తన స్థలాన్ని కాపాడుకుంటానని పోలీసులకు హెచ్చరికలు జారీ చేశారు.

**కోర్టుకు అధికారులు సర్వే రిపోర్టు**

ఈ భూ వివాదంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అద్దూరి లక్ష్మణ్ కూడా ఉన్నారు. భూమి తమదే అంటున్న పదిహేను మందిలో ఆయన కూడా ఒకరు. గతంలోనే సర్వే కోసం ఎన్నిసార్లు రమ్మని చెప్పినా మల్లారెడ్డి రాలేదని.. తనకు సర్వే అవసరంలేదని చెప్పారని ఆయన ఆరోపించారు. 82/e సర్వే నెంబర్‌లో ల్యాండ్‌పై ఇంజెక్షన్ అర్డర్ వేసినా దానికి కౌంటర్ వేయలేదు. అధికారంలో ఉన్న సమయంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కూడా ల్యాండ్ వివాదం సెటిల్ చేసుకోమని చెప్పినా. కేటీఆర్ మాటలను కూడా మల్లారెడ్డి పెడచెవిన పెట్టారని ఆరోపించారు. తమ వద్ద భూమికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయని మల్లారెడ్డి అన్నారు. ఈ వివాదం తర్వాత ప్రభుత్వం ఆ స్థలంలో సర్వే చేయించింది. మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డిల సమక్షంలోనే సర్వే చేశారు. ఇప్పుడు ఆ సర్వే నివేదికను పోలీసులకు పంపారు. భూమి మల్లారెడ్డిది కాదని తేల్చడంతో ఇప్పుడు ఆయన ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## తెలంగాణలో మోడీ పాలన తెస్తాం

- 4 స్థానాల నుంచి 8 కి వచ్చాం
- త్వరలో 8 పక్కన 8 చేర్చి 88 సీట్లు సాధిస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**విశ్వంభర, విజయవాడ:** తెలంగాణలో 88 సీట్లు సాధించి మోడీ పాలన తీసుకొస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడీ పాలన మొత్తం దేశం అంతా వస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణలో 88 సీట్లు సాధించి మోడీ పాలన తీసుకొస్తాం అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక తప్పుడు ప్రచారాలు చేసిందని మండిపడ్డారు. రామమందిరంపై కూడా తప్పుడు మాటలు ప్రచారం చేశారు కాంగ్రెస్ పార్టీ వాళ్లు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ కు ఓటేసామని ప్రజలు ఫీల్ అవుతున్నారని తెలిపారు. తెలంగాణలో బీజేపీకి ఓటు వేయాలని ప్రజలు అనుకుంటున్నారన్న ఆయన.. 4 స్థానాల నుంచీ 8 స్థానాలకు వచ్చామని, త్వరలో 8 పక్కన 8 చేర్చి 88 చేస్తాం అన్నారు. మా తప్పులు బేరీజు వేసుకుని సరైన పరిష్కారం దిశగా అడుగులేస్తాం అన్నారు. మా గెలుపోటములు పై మేం సమీక్షించుకుంటాం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.



# భారత్‌లో నాలుగేళ్ల చిన్నారికి బర్డ్ ఫ్లూ

## ధ్రువీకరించిన డబ్ల్యూహెచ్ఓ
## 2019 తర్వాత రెండో కేసు నమోదు

**విశ్వంభర, న్యూఢిల్లీ:**


భారత్‌లో రెండో బర్డ్ ఫ్లూ కేసు వెలుగులోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన నాలుగేళ్ల చిన్నారి హెచ్9ఎన్2 బర్డ్ ఫ్లూ వైరస్ బారిన పడ్డట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ మంగళవారం ధ్రువీకరించింది. భారత్‌లో తొలి బర్డ్ ఫ్లూ కేసు 2019లో వెలుగులోకి వచ్చింది. అయితే బర్డ్ ఫ్లూ వైరస్ లక్షణాలు వెలుగులోకి రావడంతో బాలుడిని అత్యవసర చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చేరిన తర్వాత బాలుడికి శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తాయని, ప్రస్తుతం ఐసీయూ వార్డ్‌లో ట్రీట్మెంట్ అందిస్తున్నట్లు డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. భారత్‌లో H9N2 బర్డ్‌ఫ్లూను మనుషుల్లో గుర్తించడం ఇది రెండోసారి. 2019లో ఒకరు దీని బారినపడ్డారని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.

**ఈ వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

బర్డ్ ఫ్లూ సోకకుండా ఉండేందుకు ముందుగా మూగజీవాలకు దూరంగా ఉండాలి. మూగజీవాల ద్వారా వైరస్‌లు ప్రభావితమయ్యే ప్రాంతాలకు వెళ్లకపోవడం మంచిదని తెలిపింది.ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో మూగజీవాలు ఉన్న ప్రాంతాలను సందర్శించే ముందు, తర్వాత తప్పని సరిగా సబ్బులతో చేతుల్ని శుభ్రం చేసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ సూచిస్తోంది. హెచ్9ఎన్2 వైరస్‌తో వ్యాధి లక్షణాల తీవ్రత ఓ మోస్తరుగా ఉంటుందని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. అయితే, అధికంగా వ్యాప్తిలో ఉన్న వేరియంట్లలో ఇదీ ఒకటని వెల్లడించింది. అయితే, దీనిపై కేంద్ర ఆరోగ్య శాఖ ఇంకా స్పందించాల్సి ఉంది.

**బర్డ్ ఫ్లూ లక్షణాలు**

బర్డ్‌ఫ్లూ వైరస్ సోకితే వ్యాధిగ్రస్తుల్లో కండ్లకలక, కడుపులో అసౌకర్యం, పొత్తికడుపు తిమ్మిరి, వికారం, వాంతులు, గుండెల్లో మంట,మెదడు వాపు,అనాక్సిక్ ఎన్సెఫలోపతి : కార్డియాక్ అరెస్ట్ లేదా మెదడుకు ఆక్సిజన్/ప్రసరణ కోల్పోవడంతో పాటు ఇతర లక్షణాలు ఉత్పన్నమై ప్రాణంతంగా మారుతుందని డబ్ల్యూహెచ్ఓ చెబుతోంది.











































# చిన్నారుల భవితవ్యానికి శాపంగా మారిన పేదరికం

పేదరికం శాపంగా మారి చిన్నారుల భవితవ్యం అంధకారంగా మారడం. అత్యంత బాధాకరమైన విషయం. ఒక దేశం సుభిక్షంగా అన్ని రంగాల్లో ప్రగతి సాధించినప్పుడే నిజమైన అభివృద్ధి. ప్రపంచంలోని చాలా దేశాల్లో బాల కార్మిక వ్యవస్థ అనధికారికంగా కొనసాగుతున్న క్రమం అభం శుభం తెలియని చిన్నారులలో శాపంగా మారిందని చెప్పవచ్చు.

బాలకార్మిక వ్యవస్థ(Child Labour) తీవ్రమైన మానవ హక్కుల సమస్య. బాల కార్మికుడు అన్న దానికి సార్వత్రికంగా ఆమోదించిన నిర్వచనం "బాల్యాన్ని నాశనం చేసే రీతిలో బాలుడు లేదా బాలిక పని చేయడం" చిదులమవుతున్న పసి హృదయాలు, వెంటాడుతున్న ఆర్థిక సమస్యలు దీనికి ప్రధాన కారణం అని చెప్పవచ్చు. బాలల శారీరక, మానసిక అభివృద్ధికి ఆటంకమై వారికి కనీస అక్షరాస్యతను, వినోదాన్ని కూడా పొందే అవకాశాన్ని ఇవ్వని పనిని, స్థితిని బాలకార్మిక వ్యవస్థ అంటారు. పాఠశాలల్లో విద్య అభ్యసించే రోజులతో అక్షర జ్ఞానానికి నోచుకోకుండా భారమైన శ్రమకు బలైపోతున్న బాలల జీవితాలు మనం సాధించిన అభివృద్ధిని ప్రశ్నిస్తున్నాయి. ఇది అత్యంత బాధాకరమైన పరిస్థితి. ఒకరకంగా నాగరికతకే తలవంపుగా పరిణమించాయి. బాలకార్మిక వ్యవస్థ ఒక్క భారతదేశానికే పరిమితం కాలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం బాలకార్మికులు తారసపడక తప్పదు.

ప్రపంచ వ్యాప్తంగా 2000 నాటికి 246 మిలియన్ల మంది బాలకార్మికులు ఉంటే 2012 ముగిసేనాటికి 168 మిలియన్ల మంది ఉన్నారు. మొత్తం బాలబాలికల జనాభాలో 11 శాతం మంది బాలకార్మికులే. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అత్యధికంగా 77.7 మిలియన్ల మంది బాలకార్మికులున్నారు. సబ్ సహారన్ ఆఫ్రికాలో 59 మిలియన్లు, లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంతంలో 12.5 మిలియన్లు, ఉత్తర ఆఫ్రికా, మధ్య ప్రాచ్యంలో 9.2 మిలియన్ల మంది బాలకార్మికులు ఉన్నారు. ఇట్టి యొక్క బాల కార్మిక వ్యవస్థ పేద దేశాల్లో బాలకార్మికులుగా మారుతున్న సంఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. అయితే జనాభా పరంగా చూస్తే అత్యధిక శాతం అధిక జనాభా కలిగిన దేశాలలో గమనించవచ్చు. ఆసియా పసిఫిక్ దేశాల్లో బాలకార్మికుల సంఖ్య భారీగా ఉంది. అయితే సబ్ సహారన్ ప్రాంతంలో బాలకార్మిక జాబితాలో చేరుతున్న సంఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సబ్ సహారన్ ఆఫ్రికాలో ప్రతీ ఐదుగురు బాలబాలికల్లో ఒకరి కంటే ఎక్కువ మంది బాలకార్మికులుగా ఉంటున్నారు.

**జూన్ 12 ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా...**



ఆర్థిక మాంద్యం, సంక్షోభం వల్ల బాలకార్మికుల సంఖ్య భారీగా పెరుగుతుందని భావించారు. అయితే అందుకు విరుద్ధంగా బాలకార్మికుల సంఖ్య పతనమైంది. దీనికి కారణం బాలకార్మికులు అధికంగా ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఆర్థిక మాంద్యం. సంక్షోభం ప్రభావాలు స్వల్పంగా ఉండటం ఒక కారణమైతే , మాంద్యం సమయంలో బాలకార్మికులకు ఉపాధి లభించకపోవడం మరో కారణం. బాల కార్మిక వ్యవస్థ సత్ఫలితాలనిస్తున్న నిర్మూలన కార్యక్రమాలను ఒక కోవలో పరిశించినట్లయితే.. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా గత నాలుగేళ్లుగా పరిస్థితి చాలా మెరుగ్గా ఉందని గణాంక సహితంగా తెలిపింది. ప్రభుత్వాలు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం చేపట్టిన చర్యలు సరైన మార్గంలో పయనిస్తున్నాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ (International Labour Organisation) స్పష్టం చేసింది.

సూరత్ లోని వజ్రాలు చెక్కుడు పరిశ్రమల్లో, శివ కాశీలోని మందుగుండు తయారీ పరిశ్రమల్లోనూ, జైపూర్ లోని రాళ్ల చెక్కుడు పనిలోనూ, ఫిరోజాబాద్ అద్దాల పరిశ్రమల్లోనూ, మురాదాబాద్‌లోని లోహ పరిశ్రమల్లోనూ, అలీఘర్ లోని తాళాల పరిశ్రమల్లోనూ, మీర్జాపూర్ తివాచీల తయారీలోనూ, మార్కాపూర్ లోని పలకల తయారీ పరిశ్రమలోనూ హీనమైన, హేయమైన వాతావరణంలో బాలకార్మికులు పనిచేస్తున్నారు. పరిశీలించి చూస్తే ఈ పరిశ్రమలన్నీ ప్రమాద భరిత పనులకు సంబంధించినవే. ఎంతో మంది పిల్లలు హోటళ్లలోనూ, దుకాణాలలోనూ, గృహాలలోనూ సేవకులుగా పనిచేస్తున్నారు.

కాశ్మీరులోని తివాచీల పరిశ్రమలో పనిచేస్తున్న వారిలో 60 శాతం మంది క్షయ, ఆస్తమా వ్యాధులతో బాధపడుతున్నట్లు పలు సర్వేలు చెబుతున్నాయి. ఫిరోజాబాద్ గాజుల పరిశ్రమలో పనిచేసే పిల్లలు అస్తమా, బ్రాంకైటిస్, కంటి సంబంధించిన వ్యాధులకు గురవుతున్నారు. శివకాశీలో టపాకాయల పరిశ్రమలలో బాలలు ప్రమాదాలకు బలైపోతున్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే బాలలు ప్రమాదాలు ఎదుర్కొంటున్నారు . భారీ యంత్రాలతో పనిచేసే వారు సరైన శిక్షణ, సరైన భద్రత లోపించడంతో ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి.

బాల కార్మికులుగా చిన్నారులు మారడానికి కారణాలను పరిశీలించి నట్లయితే.... తల్లిదండ్రుల పేదరికం పిల్లలకు శాపంగా మారుతోంది. పేదరికం వల్ల పిల్లలు తమ మనుగడ కోసమే కాకుండా తమ కుటుంబ అవసరాల కోసం పనిచేయాల్సిన దుస్థితి. పిల్లలను అదనపు ఆదాయం తెచ్చేవారిగా పేద కుటుంబాలు భావిస్తున్నాయి.

**తల్లిదండ్రుల నిరక్షరాస్యత ఓ కారణం**

ఎక్కువ మంది తల్లి తండ్రులు నిరక్ష్యరాస్యులు కావడంతో పిల్లల భవిషత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. అర్థిక పరిస్థితి, అవగాహన లోపం వల్ల ప్రాథమిక విద్యను కూడా అందించలేకపోతున్నారు. సాంఘిక ఆర్థిక స్థితిగతులు (కుటుంబ పరిమాణం, నిరుద్యోగిత మొదలైనవి.) బాలకార్మిక వ్యవస్థ వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహనా లోపం ప్రధానంగా చెప్పవచ్చు. భారీ పారిశ్రామికీకరణ, పట్టణీకరణ ఒక కోవలో చెప్పాలంటే పల్లెల నుంచి పట్టణాలకు వలస గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలు లేక పనికోసం వలసకు వెళ్లిన చోట పిల్లలను చదివించే పరిస్థితి ఉండదు. వారు కూడా బాలకార్మికులుగా మారుతున్నారు.

**ప్రస్తుత విద్యావిధానంపై పేద తల్లిదండ్రులకు విశ్వాసలోపం**

బాల కార్మిక వ్యవస్థపై సమాజంలో తీవ్రమైన అవగాహన, వ్యతిరేకత లేకపోవడం. పిల్లలను పనిలో పెట్టుకోవడాన్ని సమాజం వ్యతిరేకించిన నాడే ఈ పరిస్థితి నుంచి బయటపడగలం. పేద కార్మికుల చిన్నారుల ముఖాల్లో వెలుగులను చూడగలం.

## మన దేశంలో బాలకార్మిక వ్యవస్థ

2001 జనాభా లెక్కల ప్రకారం దేశం మొత్తం మీద 5 నుంచి 14 ఏళ్ల లోపు వయసులో ఉన్న 1.26 కోట్ల మంది బాలబాలికలు ఆర్థిక కార్యకలాపాల్లో (బాలకార్మికులుగా) ఉన్నారు. వీరిలో 12 లక్షల మంది ప్రమాదకర వృత్తుల్లో ఉన్నారు. 200405లో జాతీయ నమూనా సర్వే అంచనా ప్రకారం దేశంలో 89 లక్షల మంది బాలకార్మికులున్నారు. 200910 లో 514 ఏళ్ల వయసున్న బాలకార్మికుల సంఖ్య 49.84 లక్షలు.

UNICEF ప్రకారం దాదాపు సగం మంది, ప్రణాళిక సంఘం(Planning Commission) అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడిమానేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55 శాతం, షెడ్యూల్డ్ తెగల్లో 63 శాతం దాకా ఉందని అంచనా. బడి మానేసిన ప్రతి పిల్లవాడూ అనివార్యంగా బాలకార్మికుడిగానే జీవిస్తున్నాడని వివిధ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. అనధికారిక గణాంకాల ప్రకారం భారత్ లో 10 కోట్ల మంది బాలకార్మికులు ఉన్నారు. భారతదేశంలో మొత్తం బాలల జనాభాలో 14 శాత మంది వివిధ పనుల్లో చెమటోడ్చుతున్నారని అంచనా. మొత్తం కార్మికుల్లో 4 శాతం మంది బాలలేనని అంచనా...

ప్రతీ పదిమంది బాలకార్మికుల్లో తొమ్మిది మంది వ్యవసాయ సంబంధిత పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు శారీరక హింసకు గురవుతున్నారు. దాదాపు యాభై శాతం మంది ఏదో ఒక రూపంలో భౌతికంగా వేధింపులకు బాధితులవుతున్నారు. 50 శాతం మంది వారమంతా ఎలాంటి విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు. అందులో కొంత మంది ఏదో ఒక రూపంలో లైంగిక వేధింపులకు గురవుతున్నారు. బాలకార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తారు. కాబట్టి వారికి హక్కులు, కనీస వసతులు కరువు అవుతున్నాయి. తేలిగ్గా మోసానికి గురవుతున్నారు. వారి కష్టానికి తగిన వేతనం లభించడంలేదు . శ్రమ దోపిడీకి గురవుతున్నారు. నిర్దిష్ట పనిగంటలు లేవు. సెలవులు, బోనస్, పెన్షన్, గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ లాంటి ఏ సామాజిక భద్రతా చర్యలు వర్తించవు. వేతనాలు అతితక్కువ. పని పరిస్థితులు భయంకరంగా ఉన్నాయి.



-డా. చిటికెన కిరణ్ కుమార్
9490841284
రాజన్న సిరిసిల్ల.


# కృషితో నాస్తి దుర్భిక్షం

**నరేంద్రమోడీ, రేవంత్ రెడ్డి, రామోజీ రావు**
**స్వయంకృషి నిదర్శనం**









మూడవసారి ప్రధాన మంత్రి అయిన నరేంద్ర మోడీ నుంచి, ఇటీవల కాలం చేసిన ఈనాడు రామోజీరావు నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో వుంది. తొలితరం నుంచి ఎదిగి ఎదిగి పాత తరాలను అధిగమించి నూతన చరిత్ర సృష్టించారు. ప్రజా స్వామ్యంలో ఎలా ఎదగవచ్చో చెప్పడానికి నరేంద్ర మోడీ, మాయావతి, మమతా బెనర్జీ, ఈనాడు రామోజీరావు, దీరూబాయి అంబానీ, నిర్మా సబ్బు తయారీ దారు కొన్ని ఉదాహరణలు మాత్రమే! వ్యక్తిత్వ వికాస గ్రంథాలు రాసినవాడిగా చెప్పదగినది ఏమంటే లక్ష్యం సూటిగా వున్నపుడు నిరంకృషి, సంకల్పబలం తోడైతే ఎలా ఎదగవచ్చో చెప్పడానికి అలెగ్జాండర్ విజయాలే కాదు, నరేంద్ర మోడీ, రేవంత్ రెడ్డి, మార్గదర్శి ఈనాడు రామోజీరావు, మాయావతి, మమతా బెనర్జీ, దీరూబాయి అంబానీ, అబ్దుల్ కలాం కూడా సమకాలీన ఉదాహరణలని!

ఎదిగిన వారి నుంచి స్ఫూర్తి పొందకుండా విమర్శిస్తే తమ ఇగో తృప్తి పొందడానికో అలా ఎదగడాన్ని నిరుత్సాహ పరచడానికో ఉపయోగపడుతాయి. ఏ పెట్టుబడిదారుడు ధనవంతుడు వ్యాపార వేత్త పారిశ్రామిక వేత్త, రాజకీయ వేత్త అయినా ఇలానే ఎదుగుతారని "శక్తి యొక్క 48 సూత్రాలు," కౌటిల్యుని అర్థశాస్త్రం, మార్క్స్ రచనలు స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల విమర్శించాలనుకుంటే ఎన్నో దొరుకుతాయి. రామోజీరావు కమ్మ వర్గాన్ని పారిశ్రామిక వర్గంగా మార్వాడీ గుజరాతీలతో పోటీగా నిలిపే దశలో తన పాత్ర నిర్వహించాడు. ఎదిగిన వ్యక్తి నుంచి స్ఫూర్తి పొంది ఎదగడం అవసరం.

స్వయం కృషితో ఎదిగేవారి గురించి ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు. స్వయం కృషితో ఎదిగినవారికి అంబేద్కర్ ఒక గొప్ప ఉదాహరణ. ఆయన వేసిన బాటలో వేలాదిమంది రాజకీయ నాయకులయ్యారు, ఉన్నత అధికారులయ్యారు. విద్యావంతులయ్యారు, ఉపాధ్యాయులయ్యారు. పారిశ్రామిక వేత్తలయ్యారు. స్వయంకృషితో ఇళయరాజా, ఏఆర్ రహమాన్, చిరంజీవి, ఘంటసాల, మహమ్మద్ రఫీ, లతా మంగేష్కర్, ఎందరో సినీ ప్రముఖులు, ఆటగాళ్లు, సాహితీవేత్తలు ఎదిగారు. అయితే మన దేశంలో నైపుణ్యాలున్నప్పటికీ కోట్లాది మందికి తొలి పెట్టుబడి లేక కూలీలుగా జీతగాళ్లుగా ఉద్యోగులుగా మారుతున్నారు. దున్నేవారికి భూమి తొలి పెట్టుబడి! కుల వృత్తులవారికి వారి నైపుణ్యాలే పెట్టుబడి. అందుకు ఆర్థిక పెట్టుబడి లేక ఇతరుల వద్ద ఎంప్లాయిగా పని చేస్తున్నారు. పెట్టుబడి మార్కెటింగ్, వ్యాపార రంగాల్లో వారికి దారి చూపి ఉదాత్త లక్ష్యాల వైపునడిపిస్తే ఎదుగుతారు. లేదా ఎంతో కొంత ఎదుగుతారు.

రాజకీయాల్లో నరేంద్ర మోడీ, మోతీలాల్ నెహ్రూ, జవహర్ లాల్ నెహ్రూ వారసత్వ క్రమాన్ని అధిగమించి తొలి తరం నుంచి మూడవ సారి ప్రధానిగా పదవి చేపట్టారు. దాని వెనక 1925 నుంచి ఆర్ఎస్ఎస్ చేస్తున్న నిర్మాణ కృషివుంది. అలా మోడీకి, బండారు దత్తాత్రేయకు తొలి పెట్టుబడిగా అదంతా ఉపయోగపడింది. తొలి పెట్టుబడి లేని వారు విద్యనే తొలి పెట్టుబడిగా ఎంప్లాయీగా ఎదుగుతారు. కొందరు కాల క్రమంలో మలుపు తీసుకొని ఎంప్లాయి నుంచి ఎంప్లాయర్‌గా మారుతారు. అనగా పెట్టుబడిపై యాజమాన్యం సాధిస్తారు. విద్య విజ్ఞానంతో అంబేద్కర్ మానవ సమాజానికి గొప్ప దారి చూపారు. స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం, అందరికి సమాన అవకాశాలు, సమాన అవకాశాలు అందుకోవడానికి సమాన స్థాయికి తేవడం ప్రజాస్వామ్య కర్తవ్యంగా భావించారు. ఇలా తొలి పెట్టుబడి లేని వారికి ప్రభుత్వమే విద్య ఉద్యోగం అనే తొలి పెట్టుబడి సమకూర్చాలి అని భావించారు. విద్య విజ్ఞానంతో, ప్రజలను నడిపించే శక్తితో మొత్తం పెట్టుబడిపై, మానవ వనరులపై ఎంప్లాయర్స్ గా ఎదిగారు లెనిన్ మావో. తొలి పెట్టుబడి పుట్టుకతోనే సమకూరిన వారి ఎదుగుదల మరో విధంగా సాగుతుంది. దీరూబాయి అంబానీ తొలి పెట్టుబడి సాధించాక ముఖేష్ అంబానీ, అనిల్ అంబానీల ఎదుగుదల వలె సాగుతుంది. రాజకీయాల్లో మోతీలాల్ నెహ్రూ, జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వరుసలో సాగుతుంది. ఎంప్లాయి క్రమంగా తొలి పెట్టుబడి దారులుగా , ఎంప్లాయర్ అవడం ఎలానో వామ పక్షాలు ప్రజలకు శిక్షణ ఇవ్వలేదు. దాంతో ఉద్యోగులు ఉద్యోగులుగానే వుండి పోయారు. నిరుపేదలకు మధ్య తరగతి తొలి పెట్టుబడి సమకూర్చడంలో భాగంగా ఉచిత విద్య ఉచిత వైద్యం ఉచిత గృహ వసతి సమకూర్చడం ప్రభుత్వాల బాధ్యత. అమెరికాలో కొన్ని దశాబ్దాలుగా విద్యా నైపుణ్యాలు నూతన ఆవిష్కరణల ద్వారా తొలి పెట్టుబడి దారులు ఎదిగారు. అమెరికాలోని నేటి బిలియనీర్లలో 75 శాతం తొలి తరంగా ఎదిగినవారే. ఇండియాలో ఈ సంఖ్య పదిశాతం కూడా లేదు. కారణం ఏమిటి? మన విద్య ఎంప్లాయీగా మలిచే విద్య నేర్పుతున్నది. ఇన్నోవేటివ్ నూతన ఆలోచనలను రేకెత్తించే విద్యా విధానం లేక పోవడం, ఉద్యోగాలకు పరిమతమయ్యే దశ కొనసాగుతున్నది. అమెరికాలో పెట్టుబడి దారుల పిల్లలు సొంత సంస్థలు నిర్మించే క్రమంలో నష్టపోతే తల్లి దండ్రులు ఆదుకుంటే అలాంటి సంస్థలు మళ్లీ నష్టపోయి దివాలా తీసారు. అనిల్ అంబానీ మనకొక ఉదాహరణ. ఇండియాలో "ప్రజాస్వామిక అర్థ శాస్త్రం " రూపొందక పోవడం వల్ల తొలి పెట్టుబడి దారులుగా ఎదగాల్సిన వైజ్ఞానిక నిపుణులు శాస్త్రవేత్తలు ఉద్యోగులుగా జీవిస్తున్నారే తప్ప ఎంపిలాయర్లుగా ఎదగడం లేదు. డా.బీఆర్ అంబేద్కర్ పెట్టుబడిదారీ అర్థ శాస్త్రానికి భిన్నంగా, మార్సిస్టు అర్థశాస్త్రాన్ని భిన్నంగా "ప్రజాస్వామ్య అర్థశాస్త్రం" రూపొందించడం వీలు కాలేదు. రాజ్యాంగంలో కొన్ని మార్గ దర్శకాలు పొందు పరిచారు. ప్రజాస్వామ్యంలో సామాన్య మానవుడు తొలి పెట్టుబడి దారుడిగా, అదే క్రమంలో ఆర్థిక దిగ్గజంగా ఎదిగినవారున్నారు. దీరూబాయి అంబానీ, మొదలుకొని ఈనాడు రామోజీరావుదాకా ఎందరినైనా ఉదహరించవచ్చు. కాని ఈ ప్రాసెస్‌ను ఒక ప్రజాస్వామ్యం అర్థశాస్త్రంగా రూపొందించబడలేదు. దళిత పారిశ్రామిక వేత్తలు ఎదగాలి అని చంద్రభాను ప్రసాద్ అనేక వ్యాసాలు రాసారు. దళితులు తమ జీవిత కాలంలో మిలియనీర్లు, బిలియనీర్లుగా ఎదిగారు. ఆ అనుభవాలు ప్రజాస్వామ్యం అర్థ శాస్త్రంగా మలచవలసే వుంది. అపుడే ఆర్థిక రంగంలో నిజమైన ప్రజాస్వామ్యం వెల్లి విరుస్తుంది. అంతదాక ఎంత గొప్ప మేధావులైనా నిర్వహణ సామర్థ్యం గల వారైనా ఎంప్లాయిలుగానే ఉండి పోతారు. దానికి ఉదాహరణే అనేక అమెరికా కార్పొరేట్ సంస్థలకు ఇండియా మూలాలున్నవారు సీఈవోలుగా ఎండీలుగా కొనసాగడం చూడవచ్చు.

మనం పెట్టుబడి దారీ అర్ద శాస్త్రం, కౌటిల్యుని అర్ద శాస్త్రం, మార్క్స్ అర్ద శాస్త్రంకు భిన్నంగా అంబేద్కర్ మార్గంలో రాజ్యాంగ లక్ష్యాలతో మనదైన "ప్రజాస్వామిక అర్థ శాస్త్రం " రూపొందించుకోవడం అవసరం.



- బి. ఎస్.రాములు
బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ
ఫోన్ : 8331966987

# తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు

- బడిబాటలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా.
- ఘనంగా ప్రారంభమైన పాఠశాలలు

**విశ్వంభర, ఆదిలాబాద్**: తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మాణమవుతుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.బుధవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ 2 ఎస్సి కాలనీ గల పాఠశాలలో ప్రో. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా కలెక్టర్ రాజార్షి షా తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దెందుకు కృషి చేస్తుందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యా బోధనను అందిస్తున్నమన్నారు. విద్య వ్యవస్థను మెరుగుపరచడానికి సీఎం రేవంత్ రెడ్డి స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని త్వరలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ రాజార్షి షా మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు దుస్తులు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు వారిని చేర్పించాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తుందన్నారు. పాఠశాలలో నీటి, మరుగుదొడ్ల, ప్రహరీ గోడ, అదనపు గదుల నిర్మాణ పనులను ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. ప్రవేట్ పాఠశాలలో వేలకు వేలు డబ్బులు పెట్టి తల్లి తండ్రులు మోసపోవద్దనీ కోరారు.. సర్కారు బడుల్లో చదువుకోవాలనీ, పిల్లలు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కార్యాలయాలను పర్యవేక్షణ చేస్తూ ఉండాలని సూచనలు చేశారు. విద్యార్థులకు జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల తో కలసి పాఠ్య పుస్తకాలు, దుస్తులను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



### ప్రభుత్వ బడులోనే మెరుగైన విద్య ఎంపీ గోడం నగేష్..

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులందరికీ దుస్తులతో పాటు ఉచితంగా పుస్తకాలు మధ్యాహ్న భోజనం అందిస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడులు పున ప్రారంభం కాగా జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, డిఇఓ ప్రణీత లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారే నేడు ఐఏఎస్,ఐపీఎస్ ఉన్నత ఉద్యోగాల్లో రాణిస్తున్నారని అన్నారు.కృషి పట్టుదల తో చదివి ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు దీటుగా రాణించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే డీఈవో పలువురు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు దుస్తులను అందజేశారు. అదేవిధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా పాఠశాల పున ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, ఒక పండగ వాతావరణంలా బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను ఆయా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందజేశారు. దీంతో ఉదయం ఉత్సాహంగా బడులకు బయలుదేరిన విద్యార్థులు కొత్త పుస్తకాలతో సంతోషంగా ఇళ్లకు తిరిగి వచ్చారు.



## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**విశ్వంభర, అంబర్‌పేట్:** అంబర్పే ట్ నియోజకవర్గంలోని గోల్నాక డివిజన్‌లో గల గవర్నమెంట్ హైస్కూల్ లో బుధవారం నుండి పాఠశాలలు ప్రారంభం కావడంతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ, చదువుల విషయంలో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా పనిచేస్తున్నాయని కొనియాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలని, చదువులో మంచి ఉత్తీర్ణత సాధించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ అమృత , బాగ్ అంబర్పేట్ కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డి, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య గౌడ్ , అంబర్పేట్ కార్పొరేటర్ శ్రీ విజయ్ కుమార్ గౌడ్ , డిప్యూటీ ఈవో విజయలక్ష్మి , డిప్యూటీ ఐఓఎస్ నిజాముద్దీన్ , యుసిడి డిపార్ట్మెంట్ నుండి రజిత, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు గ్రామాలకు పట్టుకొమ్మలు

### కేశంపేట జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి




**విశ్వంభర, షాద్‌నగర్ :** కేశంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో, పాపిరెడ్డి గూడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ యూనిఫార్మ్, పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. స్థానిక ఎంఈఓ మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేశంపేట జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నదని ఇందులో భాగంగా నాణ్యమైన విద్య, సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాల మెరుగుపరుస్తూ ముందుకు వెళ్తున్నారని తెలియజేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో, ఇన్చార్జ్ ఎంపిడిఓ, ఏపీఎం, ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాల హెచ్ఎమ్ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నల్లాల నమోదు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని వాడుతున్న కుటుంబాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ఆన్ లైన్లో నమోదుచేసుకున్నారు. బుధవారం తిమ్మాపూరం గ్రామంలో మొబైల్ యాప్ ద్వారా గ్రామంలోని మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సప్లై అవుతున్న నల్లాలను ఆన్ లైన్లో నమోదు చేయాలనే పైఅధికారులనుంచి అదేశాలు వచ్చాయి. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉక్కుర్తి రమేష్, సిబ్బంది కోల మచ్చగిరి, దేవరాజు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## స్నేహితురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంలో తమతో చదువుకున్న చిన్ననాటి మిత్రురాలు వేముల అలివేల కుమారుడైన దీక్షిత్ 8 సంవత్సరాల బాలుడు అనారోగ్య సమస్యతో కొన్ని రోజుల కిందట చనిపోయాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న 2009వ బ్యాచ్ పదవ తరగతి మిత్రులందరూ కలిసి వారి కుటుంబానికి అండగా ఉండాలనుకున్నారు. ఎవరికి వారు తోచినంత డబ్బులను సమకూర్చి అలివేల కుటుంబానికి 35,000 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు మల్లం నవీన్, జెట్ట నాగరాజు, విద్యాసాగర్, సురేష్, ప్రభాకర్ , రాజు, అనిల్, రాజు, కుమార్, విజయ, తదితరులు పాల్గొన్నారు.



# మా మధ్య విభేదాలు లేవు

- మేము కలిసి ముందుకు సాగుతున్నాం
- మంత్రులు కొండా సురేఖ, సీతక్క స్పష్టం



**విశ్వంభర, వరంగల్:** ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులుగా తాము పరస్పర అవగాహనతో కలిసి సాగుతున్నామని మంత్రులు కొండా సురేఖ, సీతక్క స్పష్టం చేశారు. తమ మధ్య విభేదాలున్నాయంటూ వచ్చిన తప్పుడు కథనాల పై మంత్రులిద్దరు స్పందించారు. అవి నిరాధారమైన ఆరోపణలంటూ వారు కొట్టిపారేశారు. కొన్ని వ్యతిరేకశక్తులు కావాలని తమ పై బురదజల్లే చర్యలకు పాల్పడుతూ పైశాచికానందం పొందుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇద్దరు మహిళలకు మంత్రి పదవులను కట్టబెట్టి, మహిళా సాధికారతను చేతల్లో చూపుతున్న తీరును బీఆర్ఎస్ వంటి బూర్జువా పార్టీలు జీర్ణించుకోలేక తమ సొంత మీడియాలో వ్యతిరేక వార్తలను ప్రచురిస్తూ ప్రజల్లోకి తప్పుడు సంకేతాలను పంపిస్తున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో గిరిజన బిడ్డ సీతక్క, బిసి బిడ్డ అయిన తాను ఎదుగుతున్న తీరును చూసి తట్టుకోలేక అవాస్తవ కథనాలతో విషం చిమ్ముతున్నారని మంత్రి కొండా సురేఖ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులుగా జిల్లా ప్రగతికి, రాష్ట్ర పురోగతికి తమవంతు కృషి చేస్తున్న తమపై అసత్య ఆరోపణలు చేయడం మహిళాశక్తిని కించపరచడమేనని మంత్రులు అన్నారు. మేడారం జాతర సమయంలో తాను విపరీతమైన జ్వరంతో బాధపడినప్పటికీ, తిరిగి కోలుకొని అమ్మవార్ల గద్దెకు చేరుకున్న సమయంలో జాతరకు హాజరైన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తామిద్దరం పరస్పరం సహకరించుకుంటూ జాతర ఏర్పాట్లను పర్యవేక్షించి, విజయవంతంగా జాతరను ముగించామని మంత్రి సీతక్క తెలిపారు. మూడు నెలల పాలన అనంతరమే పార్లమెంటు ఎన్నికలు రావడంతో ఎవరికివారు ప్రచార కార్యక్రమాల్లో తలమునకలై ఉండటం, ఎలక్షన్ కోడ్ ఉండటం వంటి పలు కారణాల వల్ల తాము కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభించలేదని వారు స్పష్టం చేశారు. తోచిన అంశాలను ఆధారంగా చేసుకొని ఇష్టం వచ్చినట్లు తమ పై అసంబద్ధమైన వార్తలను వండివార్చేందుకు జర్నలిజం విలువలను గాలికొదిలేసిన మీడియా సంస్థలు చేసిన ప్రయత్నాలు బెడిసికొడతాయని వారు హెచ్చరించారు. మీడియా ముసుగులో ఏది పడితే అది రాస్తామంటే కుదరదని, ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. టిఆర్పి రేటింగ్ ల కోసమో, ఇతర ప్రయోజనాల కోసమో ఇలాంటి అవాస్తవ వార్తా కథనాలను ప్రచురించడంవల్ల ప్రజలకు మీడియా పై చిన్నచూపు ఏర్పడే ప్రమాదమున్నదని వారు సూచించారు. 'అదిగో పులి అంటే ఇదిగో తోక' అనే విధంగా వ్యవహరించకుండా నిజానిజాలను నిర్ధారణ చేసుకొని వార్తలను ప్రచురించాలని వారు సూచించారు.



## ఉద్యోగ భద్రత కల్పించాలి

### ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించిన మున్సిపల్ బిల్ కలెక్టర్లు

**విశ్వంభర, షాద్ నగర్:** చాలీచాలని వేతనాలతో కుటుంబ భారంతో ఈదలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ, ఉద్యోగ భద్రతకు కూడా నోచుకోని తమ జీవితాలను ప్రభుత్వం పట్టించుకోవాలని షాద్ నగర్ మున్సిపల్ బిల్ కలెక్టర్లు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. గత 25 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ నుండి ఇప్పటి మున్సిపల్ వరకు అనేక ఇబ్బందులతో కాలం వెల్లదీస్తున్నట్టు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినతిపత్రం తీసుకున్న అనంతరం వారితో మాట్లాడుతూ, ప్రభుత్వం ద్వారా తమకు కావాల్సిన హక్కులను వచ్చే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పట్టణ అభివృద్ధిలో మున్సిపల్ బిల్ కలెక్టర్లు ఎంతో ప్రాధాన్యత కనబర్చుతున్నారని కోట్లాది రూపాయల బిల్లులను వసూలుచేసి అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని ఈ సందర్భంగా వారిని అభినందించారు. ప్రభుత్వం ద్వారా వారికి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే శంకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిల్ కలెక్టర్లు రాములు శివశంకర్, భాస్కర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ ను పలువురు సన్మానించారు.

## అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పరిస్థితిపై పరిశీలన



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం తిమ్మాపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీలు, ఆరోగ్య కార్యకర్తలు పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. వారు ఎత్తుకు తగిన బరువును కలిగి ఉన్నారా? అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ బట్టు వైష్ణవి నరేష్ మాట్లాడుతూ, గర్భిణులు , బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని, అలా తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అంగన్వాడీ నుండి వారికి బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పరకాల మమత, రెండవ ఏఎన్ఎం కృష్ణవేణి, అంగన్వాడీ టీచర్లు పద్మ(లింగరాజుపల్లి), మేగలత(పల్లెర్ల), అంగన్వాడీ ఆయా ఎండీ నస్రీన్, ఆశకార్యకర్త రాచమల్ల రజిత, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ఈ స్థాయికి ఎదిగా

### జయశంకర్ బడిబాట కార్యక్రమంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక



**విశ్వంభర, షాద్‌నగర్:** జీవితంలో చదువు మాత్రమే మనిషికి గొప్ప మార్పు తేగలుగుతుందని తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివే ఈ స్థాయికి ఎదిగానని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ప్రభుత్వ పాఠశాల విద్య గురించి వివరించారు. ఫరూక్ నగర్ మండలం మొగలిగిద్ద గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల పున: ప్రారంభం కావడంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ అంద జేశారు. లక్షల రూపాయలు డబ్బులు ఖర్చు చేసి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాలయాల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే మంచి బోధన లభిస్తుందన్నారు. అన్ని రకాల వసతులు కల్పిస్తూ నాణ్యమైన విద్యను ప్రభుత్వాలు అందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశిందర్ రావు, ఫరూక్ నగర్ మండల ఎంఈఓ శంకర్ రాథోడ్ జడ్పిటిసి వెంకట్ రామిరెడ్డి, ఎంపిటిసి శ్రీశైలం పాల్గొన్నారు.

# మెట్పల్లిలో ముగిసిన నృత్య శిక్షణ వేడుకలు

**విశ్వంభర, మెట్పల్లి:** జగిత్యాల జిల్లా, కోరుట్ల నియోజకవర్గం, మెట్పల్లి పట్టణంలోని డీలక్స్ ఫంక్షన్ హాల్ లో మీనాక్షి నృత్య కళానిలయం ఆధ్వర్యంలో వేసవి నృత్య శిక్షణ ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాట్య గురువు తోట శ్రీవాణి ఆధ్వర్యంలో 60 మంది పిల్లలతో పాటు పేద విద్యార్థులకు ఉచితంగా నృత్య శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన జగిత్యాల బి.ఆర్ ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు విద్యార్థులకు సర్టిఫికెట్లు మెమెంటో లతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి సెలవులలో చిన్నపిల్లలకు లలిత కళల పట్ల ఆసక్తిని కలిగించి, పిల్లలను మంచి నృత్యకారులుగా రూపు దిద్దిన మీనాక్షి నృత్య కళానిలయం వారికి తల్లి దండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ భారతి విద్యానికేతన్ కరస్పాండెంట్ రమేష్, ఇబ్రహీంపట్నం జెడ్పిటిసి భారతి, హైకోర్టు న్యాయవాది వన తలుపుల అరుణ్ కుమార్, మీనాక్షి నృత్య కళానిలయం గౌరవ అధ్యక్షులు నరేందర్ జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం
- బడిబాట ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర రాజనర్సింహ



**విశ్వంభర, సంగారెడ్డి :** తెలంగాణలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహించారు. పాఠశాలల పునః ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలను నాటారు. అనంతరం, చదువుల తల్లి సరస్వతి దేవి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందని దీంతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా విద్యను అందించడంతో పాటు పుస్తకాలు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మంత్రి దామోదర పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ భావించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని, విద్యతోనే భవిష్యత్తు ముడిపడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జడ్పిటిసి మల్లికార్జున పాటిల్, జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## జూన్ 15, 16లో భువనగిరిలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జూన్ 15, 16 తేదీలలో పట్టణంలోని వైఎస్సార్ ఫంక్షన్ హాల్ లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు ) సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో జిల్లా తరగతుల కరపత్రాన్ని మండల కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్లూరి మల్లేశం మాట్లాడుతూ, దేశంలో మతోన్మాదం పెట్రేగిపోతోందని, ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయని ఈ తరుణంలో రాజకీయ పరిణామాలు, మనం నిర్వహించాల్సిన పోరాటాలపై ఈ క్లాసులలో బోధిస్తామని అన్నారు. ఈ క్లాసులకి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు , మండల కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు , ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వేముల బిక్షం ,సిపిఎం సీనియర్ నాయకులు రచ్చ గోవర్ధన్, మండల కమిటీ సభ్యులు మల్లెల శ్రీశైలం, రాచమల్ల సత్తయ్య, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనారిటీ నూతన కమిటీ

**విశ్వంభర, డిండి :** డిండి మండల కేంద్రంలో ముస్లిం మైనారిటీ నూతన కమిటీని బుధవారం స్థానిక షాదీఖానా లో గౌరవ అధ్యక్షుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మహమ్మద్ రషీద్, అధ్యక్షులుగా షేక్ ఉమర్, ఉపాధ్యక్షులుగా షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఖయ్యూమ్, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ నజీర్,కోశాధికారిగా షేక్ ఇస్మాయిల్, ముఖ్య సలహాదారులుగా మహమ్మద్ హాఫీజ్, మహమ్మద్ షబ్బీర్, మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, మహమ్మద్ మైనోద్దీన్, షేక్ అన్వర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు షేక్ పీర్ మహమ్మద్, మహమ్మద్ అబ్దుల్ కలీం, సలీం, అయ్యూబ్,బాసిద్, గౌస్,అబ్దుల్లా, షౌకత్, అప్సర్, అఫ్రోజ్, అలీమ్, జహీర్, హుస్సేని, బాబా, జాకీర్, సమీర్, ఫసీన్, సోహెల్, మెహరాజ్, సిరాజ్, నసీర్, అన్వర్, మోసిన్, ఆసిఫ్, సద్దామ్, షరీఫ్, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థపై కరువైన పర్యవేక్షణ
### బీజేపీ మండలాధ్యక్షుడు కాశీనాథ్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** పాఠశాలలు పునః ప్రారంభం అయినా.. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో కావలసిన మౌలిక సదుపాయాలు లేవని బిజెపి ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ అన్నారు. అటు ప్రభుత్వ పాఠశాలలో మరోవైపు ప్రైవేటు పాఠశాలల్లో వసతుల లేమితో యజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు లేకున్నా ఎల్ కేజీ నుండి పదోతరగతి వరకు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో బోధనా సిబ్బందికి సరైన విద్యార్హత లేకున్నా, తక్కువ జీతానికి పనిచేయించుకుంటున్నారని తెలిపారు. ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ముక్కుపిండి వేలకు వేలు వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క పాఠశాలలో ఒక్కో విధంగా అకాడమీ పుస్తకాలు ఇష్టమొచ్చిన రేటుకు అమ్ముతున్నారని ఆయన ఆరోపించారు. చివరికి బెల్టు, స్కూల్ యూనిఫామ్, షూ, సాక్సులు కూడా స్కూల్ యజమాన్యాలే అమ్ముతున్నాయన్నారు. ఏ ఒక్క ప్రైవేటు పాఠశాలలకు కనీసం విద్యార్థులు ఆడుకోవడానికి గ్రౌండ్స్ లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి మండలానికి ఒక ఎంఈఓ ను నియమించి విద్య వ్యవస్థను గాడిలో పెట్టాల్సిందిగా తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ప్రభుత్వమే ఎంతసేపు ఉచిత పథకాలు అంటూ కాలం వెల్లదీస్తుంది. నేటి విద్యార్థులే రేపటి పౌరులు అన్నది ఒకప్పుడు.. కానీ ఈరోజులలో నేటి విద్యార్థులే నేటి పౌరులు వారి భవిష్యత్తు వెలగాలంటే విద్యా వ్యవస్థపై సరైన అవగాహన ఉన్న అధికారులను నియమించినట్లయితే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందని గజరాజు కాశీనాథ్ తెలిపారు.

## నేడే లా సెట్ పరీక్ష ఫలితాల విడుదల

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ లోని న్యాయ కళాశాలల్లో ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్, పీజీ ఎల్ సెట్ పరీక్షల ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. ఈ పరీక్షల ఫలితాలను ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు విడుదల చేయనున్నారు. కాగా, జూన్ 3న రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరీక్షలను నిర్వహించారు.

## విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేత

**విశ్వంభర , నారాయణపూర్:** సంస్థాన్ నారాయణపురం మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను ఎంపిపి గుత్త ఉమాదేవి సందర్శించారు. పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థినులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి గుత్త ఉమాదేవి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. రెసిడెన్షియల్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు ఉన్నత స్థాయికి వెళుతున్నారని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ పాఠశాలలో అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తూ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా మంచి విద్యను బోధిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వారు కూడా ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పదవ తరగతిలో 10జిపిఏ సాధించిన విద్యార్థునులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం ఎంపీటీసీ బచ్చగోని గాలయ్య, స్కూల్ హెడ్మాస్టర్ సుమిత్ర, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏపూరి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ,గ్రామ శాఖ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి ,ఉప్పల నాగరాజు,దూసరి వెంకటేశం,కొండ నవీన్,విడెం సాయి కిషోర్,సింగం కృష్ణ,కర్నాటి నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల పక్షపాతి శంకర్ యాదవ్



### మం త్రి పొన్నం ప్రభాకర్

**విశ్వంభర, హైదరాబాద్ :** తలసాని శంకర్ యాదవ్ కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ కార్మికుల పక్షపాతిగా నిలిచారని బీసీ సంక్షేమ శాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ సోమవారం మరణించగా మంగళవారం అంత్యక్రియలు జరిగాయి. బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ లు వెస్ట్ మారేడ్ పల్లిలోని రాధికా కాలనీలో గల శంకర్ యాదవ్ నివాసానికి వెళ్లి శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. శంకర్ యాదవ్ గతంలో బోయిన్ పల్లి మార్కెట్ ట్రేడర్స్ అధ్యక్షుడిగా పని చేసే సమయంలో కూడా కార్మికులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారికి అన్నివిధాలుగా అండగా నిలిచే వారని మంత్రి గుర్తు చేశారు. అందరూ శంకర్ అన్న అని ఎంతో ప్రేమగా పిలుచుకునే శంకర్ యాదవ్ మృతి చాలా బాధాకరం అన్నారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ నగర నాయకులు నవీన్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్ తదితరులు ఉన్నారు.



## ప్రతీ పేదవాడికి ఉచిత విద్య అందించడమే ధ్యేయం
### మంత్రి దనసరి అనసూయ సీతక్క

**విశ్వంభర, ఆసిఫాబాద్:** ప్రతి పేదవాడికి ఉచిత విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.
ఆసిఫాబాద్ జిల్లా మోతుగూడ లోని ప్రభుత్వ పాఠశాలలో సీతక్క విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించి ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దామని రాష్ట్రం లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేశామని తెలిపారు. పేదలకు అందని ద్రాక్షగా ఉన్న ఉన్నతమైన విద్య అందించే బాధ్యత మన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్నారని, రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తమపైనే ఉందని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిద్దిపేట వేడుకలో పక్కపక్కనే రఘునందన్, హరీశ్



**విశ్వంభర, సిద్దిపేట:** సిద్దిపేటలో రాజకీయంగా ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లాలో ప్రధాన ప్రత్యర్థులుగా ఉండి మాటల తూటాలతో బాంబులు పేల్చే నేతలు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ రఘునందన్‌రావు ఒకే వేదికను పంచుకున్నారు. ఎంపీగా గెలుపొందడంతో రఘునందన్‌రావుకి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఇద్దరి పార్టీలు వేర్వేరు అయినా వారికున్న క్రేజ్ మామూలుగా ఉండదు. రాజకీయాల్లో ఒకరంటే ఒకరికి పడదు. అలాంటి నేతలు ఎంపీ ఎన్నికల్లో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. ఆ ఇద్దరు నేతలు ఎదురెదురు పడి ఆప్యాయంగా పలకరించుకున్నారు.
సిద్దిపేటలో శివపార్వతుల కల్యాణంలో ఇద్దరు కలిసి పాల్గొన్నారు. పక్కపక్కనే కూర్చున్నారు.
ఈ సన్నివేశాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుపై 39,139 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మెదక్‌లో బీఆర్ఎస్ గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేసినా ఫలితం లేకుండా పోయింది. కనీసం బీఆర్ఎస్‌కు సమీప ప్రత్యర్థి స్థానం కూడా దక్కకుండా మూడో స్థానానికే పరిమితమైంది.

## కార్పొరేట్ కాలేజీలపై విచారణ జరపాలి: పబ్బతి శ్రీకృష్ణ

**విశ్వంభర, బషీర్ బాగ్:** కార్పొరేట్ కాలేజీలపై విచారణ జరపాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం డా. అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ సీఎస్ ను కలిసి వారు వినతి పత్రాన్ని అందజేశారు. ఎలాంటి ప్రాథమిక సదుపాయాలు, సరైన అవగాహన లేని టీచర్ల తో చదువులు చెప్పిస్తున్న చైతన్య, నారాయణ, గాయత్రి, ఎన్ ఆర్ ఐ, రెజోనెన్స్ లాంటి వందలాది కాలేజీల యాజమాన్యం లక్షల రూపాయలు తల్లిదండ్రుల వద్ద తీసుకుని చివరకు విద్యార్థుల మరణాలకు కారణమవుతున్నారని ఆరోపించారు. వెంటనే కార్పొరేట్ విద్యావ్యవస్థ లను కట్టడి చేయాలని కోరారు. లేదంటే చనిపోయిన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

## ప్రభుత్వ బడుల్లోనే పిల్లలకు బంగారు బాటలు

**- ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

**విశ్వంభర, దోమ:** ప్రభుత్వ బడులలోనే పిల్లలకు బంగారు బాటలు పడుతాయని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి హనుమంతరావు, ఎంపీపీ అనసూయ, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్య గౌడ్, ఎంపీడీవో మహేష్ బాబు, ఎంఈఓ హరిచందర్, ప్రధానోపాధ్యాయులు వెంకట్, రాములు, ప్రసాద్ ఎంపీటీసీ నవాజ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాములు గౌడ్, సత్తయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలన



**విశ్వంభర, కల్వకుర్తి:** నాగర్ కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, ఎస్సి షాపింగ్ కాంపెక్స్ ను అధికారులు , ప్రజాప్రతినిధులు కలిసి పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేయాలని అధికారులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ , కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే సర్కారు లక్ష్యం

- సామాన్యుడిలా టికెట్ కొనుక్కొని 'పల్లె వెలుగు'లో ప్రయాణం
- ఖమ్మంలో బస్సులో ప్రయాణించి మహిళలతో ముచ్చటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశ్వంభర, ఖమ్మం:** కరెంటు మంచిగా వస్తుందా? ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎలా ఉంది? ఎన్నిసార్లు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు? అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు బుధవారం సాయంత్రం ఖమ్మం పాత బస్టాండ్ నుంచి బోనకల్లు మండలం జగన్నాధపురం వరకు ప్రయాణం చేస్తూ పలు అంశాలపై ఆరా తీశారు. సామాన్యుడిలా టికెట్ కొనుక్కొని పల్లె వెలుగు బస్సులో డిప్యూటీ సీఎం ప్రయాణించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. నాగులవంచ గ్రామానికి చెందిన జానమ్మ, అనంతమ్మలతో డిప్యూటీ సీఎం ముచ్చటించారు. డిప్యూటీ సీఎం ప్రశ్నలకు వారి ద్దరు స్పందిస్తూ 'బడి, గుడి, పేరంటాలకు ఉచితంగా బస్సులో వెళ్లడం మూలంగా డబ్బులు మిగులుతున్నాయి. ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతోంది' అని వారు సంతోషంగా సమాధానం ఇచ్చారు. ఈ క్రమంలో ఉచితంగా ప్రయాణం చేసే మహిళలకు జారీ చేస్తున్న జీరో టికెట్ల విధానం గురించి కండక్టర్ శైలజను డిప్యూటీ సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఫ్రీ బస్సులు వాడుకుంటున్న మహిళలు చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు. మహిళలకు రాష్ట్రంలో ఉచిత ప్రయాణం అమలు చేయడం వల్ల ఆర్టీసీ బలోపేతం అవుతున్నదని, కొత్తగా 300 పైగా బస్సులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. సీతారామ ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంతో ప్రయాణికుల సంఖ్య పెరిగినందున కొత్త బస్సులు రావలసిన అవసరం ఏర్పడుతున్నదని వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రుణాలు ఇప్పించి వారితో బస్సులు కొనుగోలు చేయించి వాటిని ఆర్టీసీలో పెట్టాలన్న ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రంలో 92 శాతం ఉన్న బలహీన వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగా తమ ప్రభుత్వ పనితీరు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం పాత బస్టాండ్ లో పాతర్లపాడు గ్రామానికి వెళ్లే బస్సును భట్టి విక్రమార్క ప్రారంభించారు.

ఎన్నికల్లో ఇచ్చిన 6 హామీల మేరకు అధికారంలోకి వచ్చి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన గంటలోపే ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని మహిళలకు ప్రారంభించామన్నారు. ప్రతినెల రూ.300 కోట్లకు పైగా మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్న డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీకి చెల్లించడం వల్ల ఆ సంస్థ బలోపేతం అవుతున్నదని తెలిపారు. కొత్త బస్సుల కొనుగోలు ఆర్టీసీ విస్తరణకు ఉచిత బస్సు పథకం ఎంతగానో దోహదపడుతున్నది..గత ప్రభుత్వంలో ఆర్టీసీ ఉంటుందా? మూసివేస్తారా? అమ్మివేస్తారా? ప్రతినెల జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా ఉండేది కాదు. ఆర్టీసీ అమ్మేస్తారన్న వార్తలు కూడా వచ్చాయి, అలాంటి దుస్థితిలో ఉన్న ఆర్టీసీని ఉచిత ఆర్టీసీ పథకం ద్వారా ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వంలో ఆర్థికంగా బలోపేతం చేశామని తెలిపారు. ఆర్టీసీ ఉన్న అప్పులపై వడ్డీ రేట్లు తగ్గించడానికి ఆలోచన చేస్తున్నామని బీఆర్ఎస్ నాయకులకు మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయడం ఇష్టం లేనట్టుగా ఉంది.. అందుకే ఉచిత ఆర్టీసీ బస్సు పథకం నడవదంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకులు ఏడు లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్ర ప్రజలపై భారం మోపారని అన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ సంపద సృష్టించి ఆ సంపదను ప్రజలకు పంచడానికి తమ ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతి నెల 15 తర్వాతనే వేతనాలు ఇచ్చేదని, తాము అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ఉద్యోగులకు ఒకటో తారీఖున వేతనాలు ఇస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలో ఐదు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేస్తున్న వాటి ద్వారా కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారు. ఇది బిఆర్ఎస్ నాయకుల కంటికి కనబడటం లేనట్టుంది... కళ్ళు లేని కబోదులుగా మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, జిల్లా కలెక్టర్ గౌతమ్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

**విశ్వంభర, రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ మండలంలో మండల విద్యాధికారి రాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా "పాఠశాల సంసిద్ధత కార్యక్రమం" మండల స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివరాంపల్లి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యావసతుల కల్పన కోసం ప్రభుత్వం చేపడుతున్న పనులవల్ల ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా రూపుదిద్దుకున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో బడీడు పిల్లలను చేర్పించాలని ప్రజలను కోరారు. నేడు నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ అర్చన, స్థానిక పాఠశాల ఏ. ఏ. పి. సి. ఛైర్మన్ సునీత, స్థానిక పాఠశాల మాజీ ఛైర్మన్ శ్రీధర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**శంషాబాద్ లో...**

శంషాబాద్ మండలంలో మండల విద్యాధికారి రాం రెడ్డి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల పెద్ద తూప్ర తండా లో పాఠశాల సంసిద్ధత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలలు, యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ ,స్థానిక ఎంపిడిఓ మున్ని , స్థానిక పాఠశాల ఉపాధాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫిట్ నెట్ లేని బస్సులపై రవాణాశాఖ అధికారుల దాడులు పలు బస్సులు సీజ్

**విశ్వంభర, హైదరాబాద్ :** ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులపై అధికారులు కొరడా ఝుళిపించారు .వేసవి సెలవుల అనంతరం బుధవారం పాఠశాలలు పున: ప్రారంభం అయ్యాయి. అయితే ట్రాన్స్ పోర్టు విభాగం అధికారులు గత కొన్ని రోజులుగా ఫిట్ నెస్ లేని బస్సులను రోడ్లపై తిప్పరాదని, ప్రతి బస్సుకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి, 15 సంవత్సరాలు దాటిన బస్సులకు ఫిట్ నెస్ తప్పనిసరని హెచ్చరిస్తూ వస్తున్నారు. అయినా కొన్ని పాఠశాలల యాజమాన్యాలు వారి సూచనలు బేఖాతరు చేస్తూ స్కూళ్లు తెరిచిన మొదటి రోజే ఫిట్ నెస్ లేని బస్సులను రోడ్లమీదకు వదిలారు. దీంతో ఆర్టీఏ అధికారులు లంగర్ హౌజ్ , ఎల్బీ నగర్, నాగోల్ , దిల్ సుఖ్ నగర్, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాలలో ఆర్టీఏ అధికారులు స్కూల్, కాలేజ్ బస్సులను తనికీ చేసి నిబంధనల మేరకు లేని బస్సులను సీజ్ చేశారు . అంతేకాకుండా వాహనాలకు సంబంధించి ఇన్సురెన్స్ , పర్మిట్ , డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ , ఫైర్ సేఫ్టీ కిట్, ఫస్ట ఎయిడ్ కిట్ లను పరిశీలించారు .

**ప్రమాదాల నివారణకు చర్యలు...**

ఫిట్ నెస్ లేని స్కూల్, కాలేజ్ బస్సులు తరచుగా ప్రమాదాలకు గురి కావడం, రోడ్లపై మొరాయించడం వంటివి జరుగుతున్నాయి. ఇటువంటి వాటికి చెక్ పెట్టేందుకు గాను రవాణా శాఖ అధికారులు పాఠశాలల మొదటి రోజే చర్యలకు ఉపక్రమించారు . స్కూల్ బస్సుల ఫిట్ నెస్ పై రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు రవాణా శాఖ అధికారులు చేస్తున్న సన్నాహాలలో భాగంగా గ్రేటర్ పరిధిలో అధికారులు చెకింగ్ ముమ్మరం చేశారు . ప్రతి విద్యా సంస్థ యొక్క వాహన ఫిట్ నెస్ సర్టిఫికేట్ యొక్క చెల్లుబాటు ప్రతి సంవత్సరం మే 15వ తేదీ నాటికి పూర్తవుతుంది. దీంతో విద్యా సంస్థలు తిరిగి తెరుచుకునే సమయానికి బస్సులు మరమ్మతులు చేయించుకుని ఫిట్ నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది . చాలా వరకు విద్యా సంస్థలు ఇలాంటి నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించిన అధికారులు దాడులు ప్రారంభించారు . ధృవపత్రం అందని వాహనాలు రోడ్లపై పట్టుపడితే విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.ఇందులో భాగంగానే రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్ చేపడుతోంది .

**డ్రైవర్ వయస్సు 60 ఏండ్లు మించొద్దు...**

బస్సులు నడిపే డ్రైవర్ ఆరోగ్యంగా ఉండాలని, 60 ఏళ్లు మించకూడదని రవాణాశాఖ అధికారులు స్పష్టం చేశారు . డ్రైవర్ వివరాలను ఆర్టీఏ కార్యాలయంలో సమర్పించాలని, 5 సంవత్సరాల అనుభవం ఉన్న వారినే నియమించుకోవాలని సూచించారు . ఫిర్యాదు పుస్తకం, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలని, ప్రతి బస్సులో అటెండర్‌ను నియమించాలని , జాబితాతో పాటు బస్సు రూట్ ప్లాన్ జత చేయాలని అధికారులు పేర్కొన్నారు . డ్రైవర్ అగ్నిమాపక యంత్రంతో పాటు ఆర్టీఏ నిర్వహించే ఒకరోజు రిఫ్రెషర్ శిక్షణా కోర్సుకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు . ఈ దాడులలో రంగారెడ్డి, మేడ్చల్, ఉప్పల్ రవాణా శాఖ అధికారులు కిరణ్ రెడ్డి, కృష్ణ వేణి, సునీత, నవీన్, ఉపాసిని, ప్రతాప్ రాజా, త్రివేణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 46 విద్యాసంస్థల బస్సులపై కేసులు నమోదు

**డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమీషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్**

బుధవారం నుండి పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యా సంస్థల బస్సులపై ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా వ్యాప్తం గా రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా అధికారులు 5 బృందాలు గా ఏర్పడి తనిఖీలు చేపట్టి ఫిట్ నెస్ లేని, పన్నులు చెల్లించని 46 బస్సులపై కేసు నమోదు చేయడం జరిగింది. ఫిట్ నెస్ లేని,15 సంవత్సరాలు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితులలో రోడ్ల పై తిప్పరాదు. అనుభవం గల, 60 సంవత్సరాలు మించని డ్రైవర్లను నియమించుకోవాలి. ఈ తనిఖీ లు కొనసాగుతాయి ప్రతీ విద్యా సంస్థ బస్సు తప్పనిసరిగా సంబంధిత రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్ నెస్ సర్టిఫికెట్ పొందాలి .



# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు




### బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్:** ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యధిక సంఖ్యలో విద్యార్థులు చదువుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల ప్రతిష్టను పెంచే విధంగా రాష్ట్రవ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దానిలో భాగంగా బుధవారం ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని వనస్థలిపురం డివిజన్ నందు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాలు,స్కూల్ యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మంచి అధ్యాపకులు ఉత్తమ బోధన అందిస్తున్నారని తెలిపారు. చదువుల విషయంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు గట్టి పోటీ ఇస్తున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హీర్యా నాయక్, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్, పాఠశాల హెడ్ మాస్టర్ దుర్గలత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్థిక సంఘంతో కర్ణాటక సంఘం భేటీ

**ఆర్థిక పరిస్థితులపై సుదీర్ఘ సమీక్ష**

**హాజరైన చైర్మన్ రాజయ్య, ఆర్థిక సంఘం కార్యదర్శి స్మితా సబర్వాల్**




**విశ్వంభర, హైదరాబాద్:** స్థానిక సంస్థల బలోపేతానికి పరస్పరం అవగాహన పెంపొందించుకునేందుకు తెలంగాణకర్ణాటక రాష్ట్రాలు దృష్టి సారించాయని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కర్ణాటక రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ ఎండి సమెల్ల, ఆర్ఎస్ పాండే అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల పనితీరు పరిశీలనతో పాటు స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను పరిశీలించేందుకు గాను కర్ణాటక ఆర్థిక సంఘం చైర్మన్ నారాయణ స్వామి,సభ్యులు ఎండి సమెల్ల, ఆర్ యస్ పాండే ఆధ్వర్యంలో ఆర్థిక సంఘం ప్రతినిధుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీ లోని రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యాలయంలో రెండు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధుల బృందం సమావేశమై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించింది. రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సభ్యులు సంకేపల్లి సుదీర్ రెడ్డి, మాలోతు నెహ్రూ నాయక్, రమేష్‌లతో పాటు రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ పాల్గొన్నారు. అదే విధంగా కర్ణాటక రాష్ట్రం నుండి ఆ రాష్ట్ర చైర్మన్ నారాయణ స్వామి సభ్యులు యం.డి సమెల్ల, ఆర్ యస్ పాండే పాల్గొన్నారు. కర్ణాటక లో స్థానిక సంస్థల పని తీరును వివరించడంతో పాటు ఆర్థిక పరిపుష్టికి ఆ రాష్ట్రంలో తీసుకున్న నిర్ణయాలు కర్ణాటక ఆర్థిక సంఘం చైర్మన్ వివరించారు. అదే విధంగా తెలంగాణా లో స్థానిక సంస్థల పని తీరు తెలుసుకోవడంతో పాటు ఆర్థికంగా బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను విషదీకరించారు. ఇతర రాష్ట్రాలలో కూడా పర్యటించి రెండు రాష్ట్రాలలో స్థానిక సంస్థల పనితీరును మెరుగు పరిచేందుకు గాను తీసుకోవాల్సిన చర్యలను రెండు రాష్ట్రాల ప్రతినిధుల బృందం పరస్పరం చర్చించుకొని ఒక అవగాహన కు వచ్చారు.

## జీటీ 6- ఏ ఐ ఫ్లాగ్ షిప్ కిల్లర్ ని ప్రకటించిన 'రియల్ మీ'

**విశ్వంభర, బషీర్ బాగ్ :** 'రియల్ మీ' భారత దేశ యువత కి ఒక పేరుగాంచిన స్మార్ట్ ఫోన్ బ్రాండ్. ఇది వారి ఆధునిక ఆవిష్కరణ అయిన రియల్ మీ జి టి 6 ఏ ఐ ఫ్లాగ్ షిప్ కిల్లర్ ని ప్రకటించారు. దానికి జూన్ 20, 2024 న ప్రపంచ వ్యాప్తంగా ప్రవేశ పెడుతున్నారు. ఈ ఆట ని మార్చే పరికరం వకా ఆఫర్స్ ని మాత్రమే కాకుండా ఎన్నడూ చూడని ఏ ఐ ఫీచర్స్ తో పాటు అన్నింటా ఏ ఐ శక్తిని ఇచ్చే ఫ్లాగ్ షిప్ కిల్లర్ గా కూడా నిలిచింది. దాని పనితీరు ట్రియో అయిన ఫ్లాగ్ షిప్ చిప్ సెట్ , మెరుగైన కెమెరా, పరిశ్రమని ముందుకు నడిపించే కూలింగ్ సిస్టమ్ ని అందించే వాటికి కృతజ్ఞతలు తెలిపింది.

రియల్ మీ జీటీ 6 ని "ఏ ఐ ఫ్లాగ్ షిప్ కిల్లర్" గా నిలిచోబెట్టారు. ఇది దీని చక్కని పనితీరు తో ప్రీమియం స్మార్ట్ ఫోన్ వినియోగదారులని టార్గెట్ చేస్తుంది. ఇది మెరుగైన ఫీచర్లను అందిస్తుంది. ఇవి స్మార్ట్ ఫోన్ వినియోగదారుల పరిశ్రమని మెరుగుపరచడానికి సెట్ చేయబడ్డాయి. వీటిని తరువాత తరం ఆటని మార్చే వాటిగా మార్క్ చేశాయి. ఈ పరికరం ఏ ఐ టెక్నాలజీ ని వాడి చిత్రం నాణ్యతని, వినియోగదారుల పరస్పర చర్య ను ఉత్పత్తిని పెంచుతాయి. ఇది ఏ ఐ టెక్నాలజీ ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యువ ప్రేక్షకులకు అందించడానికి ఉపయోగపడుతుందని ప్రకటించింది.

## బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంపై అవగాహన సదస్సు

**విశ్వంభర, హైదరాబాద్:** బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ & UNPKFC INDIA, ప్రపంచ మానవ హక్కుల సమితి WHRC సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జూన్ 12న, బాల కార్మికుల వ్యతిరేకత దినోత్సవం సందర్భంగా, ప్రపంచ మానవ హక్కుల సమితి, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ , యునైటెడ్ పీస్ కీపర్స్ ఫెడరల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వడ్డేశ్వరం రైలు గేటు వద్ద గుడిసెలలో నివసిస్తున్న వారికి , విద్య గురించి పిల్లలు చదువుకోవడంతో జరిగే ప్రయోజనాల గురించి వివరిస్తూ అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ రావూరి బాలరాజు మాట్లాడుతూ, పరిశ్రమలలో గాని చిన్నచిన్న వ్యాపారస్తులు గాని బాల కార్మికులను చేర్చుకోవడం నేరమని విద్య వారి హక్కు అని తెలియజేసి పిల్లలకు పలకలు, పుస్తకాలు , స్వీట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ హెల్త్ కేర్ ఫౌండర్, ప్రపంచ మానవ హక్కుల సమితి స్టేట్ ఉమెన్ సెల్ వింగ్ వైస్ చైర్మన్ కాగితాల స్వాతి గౌడ్ పిల్లలకి పని వద్దు చదువు ముద్దు అనే స్లోగన్ తో చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కాటూరి శ్యామ్ అన్నం నాగబాబు , వనజ ,కారంకి శ్రావణి, కంచర్ల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## విభజన హామీలను పరిష్కారించాలి -డివైఎఫ్ఐ డిమాండ్

**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విభజన హామీల పరిష్కారానికి కృషి చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు కోట రమేష్ ,ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు .బుధవారం డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గత రెండు దఫాలుగా అధికారంలో ఉన్నా తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు. తెలంగాణకు బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మెడికల్ కాలేజీలు, ఐఐటీ, ఐఐఎం, త్రిపుల్ ఐటీ, మైనింగ్ యూనివర్సిటీలనూ ఇప్పటివరకు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. మూడవ సారి అధికారం చేపట్టిన కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వంద రోజుల కార్యాచరణలో భాగంగా తెలంగాణ విభజన హామీల పరిష్కారానికై ,వాటి అమలుకై కృషి చేయాలని రాష్ట్రం నుండి ఎన్నికైన మంత్రులు,ఎంపిలు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మోడీ ప్రభుత్వం విద్వేషాలను వీడి దేశ అభివృద్ధికి కృషి చేయాలని నిరుద్యోగ సమస్య పరిష్కారానికై దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న కేంద్ర ప్రభుత్వ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్ టి ఏ వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. కావున ఎన్టిఏ పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగువిధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బషీరుద్దీన్, తిరుపతి, గడ్డం వెంకటేష్, జావెద్, తిరుపతి నాయక్, కార్తీక్, క్రిష్ణ నాయక్, శివ వర్మ, మల్లం మహేష్, జగన్,రాష్ట్ర కమిటిసభ్యులు రమేష్, శృతి, వీరబాబు, హస్మీ, మహేష్, సాంబమూర్తి, ప్రవీణ్, సంజీవ్, శ్రీకాంత్, సాగర్, మహేష్, టీకానంద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# కామం తీర్చుకోవడానికి అడ్డు వస్తుందని 22 నెలల చిన్నారి దారుణ హత్య



**విశ్వంభర, సూర్యాపేట :** అక్రమ సంబంధానికి అడ్డుగా ఉందని 22 నెలల చిన్నారిని అతి దారుణంగా చిత్రహింసలకు గురిచేసి హత్య చేశాడో కామాంధ ప్రియుడు. నవ మాసాలు మోసి పురిటి నొప్పులు భరించి జన్మనిచ్చిన తల్లి.. ప్రియుడితో గడిపే రెండు క్షణాల ఆనందం కోసం బిడ్డను సైతం చంపుకుంది. ఈ హృదయవిదారక సంఘటన సూర్యాపేట జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలను చివ్వెంల ఎస్ఐ వెంకట్ రెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం..

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన మోత్క సాయిలు, విజయ దంపతుల కూతురు రమ్య అలియాస్ నవ్యశ్రీ (23)ని కొన్నాళ్ల క్రితం గుండారం గ్రామానికి చెందిన కటకట లక్ష్మణ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కూతుళ్లు జన్మించారు. పెద్దమ్మాయి ఆరుణ్య (4), చిన్న కూతురు మహాన్వి (22 నెలలు). కాగా, రమ్యకు గుండారం గ్రామానికి చెందిన బొల్లెంక అరవింద్ రెడ్డితో ఏడు నెలల క్రితం నుంచి అక్రమసంబంధం నడుస్తోంది. ఈ క్రమంలో ఈ విషయం గ్రామంలో తెలియడంతో రమ్యను, ఆమె ఇద్దరు కూతుళ్లను తీసుకుని అరవింద్ రెడ్డి 20 రోజుల క్రితం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలపురం గ్రామానికి వచ్చాడు. పిల్లలను నిన్ను చూసుకుంటానని అక్కడే గది అద్దెకు తీసుకుని కాపురం పెట్టిన ఈ కామంధ ప్రియుడు తమ కామ కోరికలు తీర్చుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. అయితే వీరి రాసలీలలకు 22 నెలల చిన్నారి మహాన్వి అడ్డువస్తుందని అరవింద్ రెడ్డి అతి క్రూరంగా వ్యవహరించాడు. పసికందు అనికూడా చూడకుండా చిన్నారిని ఇష్టం వచ్చినట్లు కొరకడంతోపాటు తీవ్రంగా కొట్టాడు. అంతటితో ఆగకుండా శరీరమంతా కాల్చి తీవ్రంగా కాల్చి వాతలు పెట్టిగాయపరిచాడు. అయినా కోపం తగ్గని అరవింద్ రెడ్డి మంగళవారం రాత్రి చిన్నారి నిద్రిస్తుండగా తలను నేలకేసి కొట్టి హత్య చేశాడు. అయితే ఈ సమయంలో రమ్య తన పెద్ద కూతురిని తీసుకుని కిరాణ దుకాణం వద్దకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికివచ్చే సరికి మహాన్వి చనిపోయి ఉండటం.. అరవింద్ రెడ్డి పరారీ కావడంతో షాక్‌కు గురైంది. బుధవారం ఉదయం ఈ దారుణ ఘటనను రమ్య తన మేనత్త కటికల గంగమణికి తెలపడంతో విషయం వెలుగులోకి వచ్చింది. జరిగిన దారుణంపై గంగమణి చివ్వెంల పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన సీఐ సురేందర్ రెడ్డి, ఎస్ఐ వెంకట్ రెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మహాన్వి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించి ప్రియుడు బొల్లెంక అరవింద్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడు దారుణ హత్య

**విశ్వంభర, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఓ ఉపాధ్యాయుడిని దారుణంగా కొట్టి హత్య చేసిన సంఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గజేందర్ అనే ఉపాధ్యాయుడు బుధవారం పాఠశాల పున ప్రారంభం కావడంతో విధులకు హాజరయ్యేందుకు గాను నార్నూరు మండలంలోని తన స్వగ్రామం నాగల కోయ నుంచి జైనథ్ మండలంలోని మేడిగూడ గ్రామ లో గల ప్రభుత్వ పాఠశాలకు విధుల నిమిత్తం బైక్ బయలుదేరాడు. నార్నూర్ మండలంలోని అర్జుని,లోకారి మధ్యలోగల అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు అతనిపై దాడి చేసి హత మార్చారు. అయితే ఈ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సంబంధిత మండల పోలీసులు దీనిపై విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వెల్లడించారు. కాగా మృతుడు గజేందర్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నట్లు సమాచారం. అయితే ఈ హత్యకు కుటుంబ తగాదాల కారణమే అయి ఉంటుందేమోనని పలువురు అనుమానిస్తున్నారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు



**విశ్వంభర, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శుభం రెస్టారెంట్, హిమాలయ రెస్టారెంట్, చిల్లి రెస్టారెంట్, బర్గర్ కింగ్ బేకరీలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందని జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ మనోజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ తనిఖీలలో మాంసం, ఎక్స్పైడ్ ఐటమ్స్ ఉన్నాయా అని పరిశీలించారు. ఆహార నాణ్యతను పరీక్షించడానికి శాంపిల్స్ సేకరించడం జరిగిందన్నారు. వాటిని హైదరాబాద్ లోని స్టేట్ ఫుడ్ లేబరేటరీకి పంపించడం జరిగిందన్నారు. ఇందులో కల్తీ అని నిర్ధారణ అయితే క్రిమినల్ కేసులు రిజిస్టర్ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని హోటల్ యాజమాన్యం నిల్వ మాంసం, శుభ్రత, ఎక్స్ పైడ్ పదార్థాలు, విక్రయించినట్లయితే క్రిమినల్ కేసులు రిజిస్టర్ చేస్తామన్నారు. అందరూ విధిగా లైసెన్స్ కలిగి ఉండాలి సూచించారు.

## మెట్పల్లి చాంపియన్స్ లీగ్ విన్నర్‌గా స్టార్ ఈఎన్‌టీ హాస్పిటల్



**విశ్వంభర, మెట్పల్లి:** జగిత్యాల జిల్లా, కోరుట్ల నియోజకవర్గం, మెట్పల్లి చాంపియన్స్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లో కేఎస్‌రెడ్డి గార్డెన్స్ తో పోటీపడిన స్టార్ ఈఎన్‌టీ హాస్పిటల్ టీమ్ గెలిచింది. మెట్పల్లి పట్టణ మినీ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ ఆడగా, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ జువ్వాడి నర్సింగరావు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మెట్పల్లి క్రికెట్ లీగ్ జువ్వడి నర్సింగరావు విజేతలను శాలువాలతో సన్మానించారు. ఆ తర్వాత నర్సింగరావు మాట్లాడుతూ, క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యం మెరుగుపరుస్తుందని అన్నారు. మెట్పల్లి ఛాంపియన్స్ లీగ్ ... ఆర్గనైజర్ మహమ్మద్ అఖిల్, మొహమ్మద్ ఇర్ఫాన్, మహమ్మద్ అజీమ్ గఫూర్ చాంద్, పి ఈ టి ఆల్ రౌండర్ గంగాధర్ ను అభినందించారు. కార్యక్రమానికి జెట్టి లింగం ఎర్రోళ్ల హనుమాన్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పండుగల సాయన్న విగ్రహ ఆవిష్కరణ

**విశ్వంభర, గద్వాల :** గద్వాల నియోజకవర్గం గద్వాల మండలం పరిధిలోని జిల్లెడబండ గ్రామంలో పండుగల సాయన్న విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పండుగల సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కు మాజీ సర్పంచ్, ముదిరాజ్ సంఘం నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...గద్వాల నియోజకవర్గంలో మొట్టమొదటిసారి జిల్లెడ బండ గ్రామంలో పండుగల సాయన్న విగ్రహ ప్రతిష్ట చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని, నేడు గ్రామంలో పండగ వాతావరణం నెలకొందని తెలిపారు. తెలుగు పండుగల సాయన్న. భారత స్వాతంత్రోద్యమ (1900) కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలు ఒక సమాంతర చరిత్ర.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

- తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి
- ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- ప్రొఫెసర్ జయశంకర్ బడి బాటలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డా. కడియం కావ్య



**విశ్వంభర, హనుమకొండ :** స్టేషన్ ఘనపూర్ మండలం చాగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడి బాట స్వాగత దినోత్సవం కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బడి ఈడూ పిల్లలందరిని బడి బాట పట్టించాలి అని, ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుంది అని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నారు అన్నారు. పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశాం అని, త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు చేయబోతుంది ప్రభుత్వం అని తెలిపారు. విద్యా రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్ట బోతున్నాం అని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలి అన్నారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఎంపీగా ఎన్నికైన తర్వాత మొదటి కార్యక్రమం బడి బాట కార్యక్రమం కావడం చాలా అదృష్టంగా బావిస్తున్నాను అని అన్నారు. కడియం ఫౌండేషన్ ద్వారా బ్యాక్ టు స్కూల్ కార్యక్రమాన్ని నిర్వహించం అని, ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది అని, విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను రూపొందుతున్నాయి అని, విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాము, సిడిపిఓ ఫ్లోరెన్స్, ఎంపిడిఓ కృష్ణవేణి, ఏసిపి భీమ్ శర్మ, ఏఎంఓ శ్రీనివాస్, ఎమ్మార్వో వెంకటేష్, జడ్పిటిసి మారాపాక రవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పంప్డ్ స్టోరేజ్ హైడల్ ప్రాజెక్టుపై సమీక్ష



**విశ్వంభర, కొత్తగూడెం:** ఇల్లందు ఏరియా జవహర్ ఖని ఉపరితల గనిలో ఏర్పాటు చేసే పంప్డ్ స్టోరేజ్ హైడల్ ప్రాజెక్టుపై సింగరేణి ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి డైరక్టర్ (ఈ&ఎం) డీ.సత్యనారాయణ రావు, టాటా కన్సల్టెన్సీ ఇంజనీర్లు సమర్పించిన సాధ్య సాధ్యాల నివేధికపై టాటా కన్సల్టెన్సీ ఇంజనీర్లతో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సింగరేణి డైరక్టర్ (ఈ&ఎం) డి. సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో మూసివేయబడిన ఉపరితల గనులను సద్వినియోగం చేసుకుని వాటి ద్వారా జల విద్యుత్ ఉత్పత్తి చేపట్టే ఉద్దేశంతో సింగరేణి సంస్థలో ప్రయోగాత్మకముగా ఇల్లందు ఏరియాలోని జవహర్ ఖని ఉపరితల గనిలో పంప్డ్ స్టోరేజ్ హైడల్ ప్రాజెక్టు ఏర్పాటు చేయబోతున్నామని దీని ద్వారా సౌర విద్యుత్తు సాయంతో రాత్రిపూట జల విద్యుదుత్పత్తి చేస్తామని తెలిపారు. జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణం సాధ్యమైతే అందుకయ్యే వ్యయం, లాభ నష్టాల్ని బేరీజు వేసే పనిని తాజాగా టాటా కన్సల్టెన్సీ బృందానికి అప్పగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరక్టర్ (ఈ&ఎం) డి.సత్యనారాయణ రావు గారితో పాటు జిఎం(సిపిపి) ఏ.రవి కుమార్, జిఎం(ఈ&ఎం) సోలార్ జి.ఎస్. జనకిరామ్, జిఎం(సర్వే) ఎండి.జైనులబద్దీన్, చీఫ్(ఈ&ఎం) పిపిడి, హైదరాబాద్ ఎన్వికేవిశ్వనాధరాజు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇల్లందు ఏరియా జిఎం జాన్, సంబంధిత అధికారులు, టాటా కన్సల్టెన్సీ ఇంజనీర్లు పాల్గొన్నారు.



## జాతీయ అవార్డు అందుకున్న రామచంద్రం

**విశ్వంభర, చింతపల్లి:** సామాజిక కార్యకర్త వరాల పెద్ద రామచంద్రం లైఫ్ టైం అచీవ్‌మెంట్ జాతీయ అవార్డును అందుకున్నారు. జూన్ 10న మహారాష్ట్రలోని పూణేలో బహుజన వెస్టర్న్ రైటర్స్ నాలుగవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి మండలం కుర్మపల్లి గ్రామానికి చెందిన వరాల పెద్ద రామచంద్రం యాదవ్ వెస్ట్రన్ ఇండియన్ కాన్ఫరెన్స్ లో బహుజన సాహిత్య అకాడమీ వారు అందించిన అవార్డులలో భాగంగా జాతీయ చైర్మన్ నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. గత 50 సంవత్సరాలుగా సామాజిక సేవ చేసినందుకు గాని ఈ అవార్డును అందించారు. అవార్డును సెలెక్ట్ చేసిన సెలక్షన్ రాష్ట్ర కమిటీ మెంబర్ డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు. వెస్టర్న్ ఇండియాలోని ఈ కాన్ఫరెన్స్ లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవా రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది డెలిగేట్స్ హాజరయ్యారని తెలిపారు.

## విద్యార్థులకు మంచి విద్యను అందించాలి

**విశ్వంభర, కొత్తూరు:** విలువలతో కూడిన విద్యను అందించాలని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని ఇమ్మూల్ నర్వ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ యూనిఫారం, పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని, ఇందులో భాగంగా నాణ్యమైన విద్యను మంచి సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా మెరుగుపరుస్తూ ముందుకు వెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శోభలింగం నాయక్,ఎంపీడీవో అరుంధతి, తాజా మాజీ సర్పంచ్ రవి నాయక్, డిపిఎం, ఎపిఎం,పంచాయతీ సెక్రెటరీ, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యారంగానికి ప్రాధాన్యత కల్పిస్తా

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**విశ్వంభర, చొప్పదండి**: బడిబాట కార్యక్రమంలో భాగంగా చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేసి, 202324 సంవత్సరానికి గాను 10వ తరగతి లో 10 జీపీఏ సాధించిన యేలిగేటి సవితకు 5 వేల రూపాయల ప్రోత్సాహకం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యారంగం పైన ముఖ్యమంత్రి గారు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ స్కూళ్లతో పోటీ పడేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని చొప్పదండి నియోజకవర్గంలో విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి విద్యా వ్యవస్థను పటిష్ఠం చేస్తామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు అడిగిన విధంగా అదనపు తరగతి గదుల నిర్మాణం వెంటనే చేపట్టడంతో పాటు, ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చొప్పదండి క్రికెట్ ప్రీమియర్ లీగ్ 3వ సీజన్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ శ్రేణులతో పాటు ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

- ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క
- ఖమ్మం కలెక్టరేట్ లో మంత్రులు తుమ్మల, పొంగులేటి, కలెక్టర్ గౌతమ్ సమీక్ష



**విశ్వంభర, ఖమ్మం:** సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ లో సాగు నీటిపారుదల, విద్యా శాఖల ప్రగతిపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రపంచంతో పోటీపడే విధంగా ఖమ్మం జిల్లా ను అద్భుతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలన్నారు. ఉద్యోగులు పారదర్శకంగా, జవాబుదారీగా వ్యవహరించాలన్నారు. వ్యవసాయ ఆధారితమైన ఖమ్మం జిల్లాలో వ్యవసాయాన్ని బలోపేతం చేసుకోవడం వల్ల ఆర్థిక వనరులు పెరుగుతాయన్నారు. వ్యవసాయానికి కావాల్సిన సాగు నీరు అందించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల ప్రగతి, వాటికి కావాల్సిన నిధులు, పూర్తయ్యే గడువును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఉన్న మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, ఎన్ఎస్పీ కెనాల్స్, సీతారామ ప్రాజెక్ట్, మధ్య తరహా, చిన్న తరహా పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి క్యాలెండరు తయారు చేసుకుని ఆ ప్రణాళిక ప్రకారంగా ముందుకు వెళ్లాలన్నారు. మొదటగా ఆరు నెలలో పూర్తయ్యే ప్రాజెక్టులు, ఏడాదిలోపు పూర్తయ్యే ప్రాజెక్టులు, రెండు సంవత్సరాల్లో పూర్తి చేసుకునే ప్రాజెక్టులకు సంబంధించి క్యాలెండర్ తయారు చేసుకుని నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా లక్ష్యం పెట్టుకొని పనిచేయాలన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల చిన్న తరహా సాగునీటి ప్రాజెక్టులకు అన్ని అనుమతులున్నప్పటికీ ఇప్పటికీ పనులు మొదలు కానీ (ఉదాహరణకు పండ్రేగుపల్లి) ప్రాజెక్టుల పనులను సత్వరం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా నుంచి వృధాగా సముద్రంలోకి నీరు వెళ్లకుండా ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకొని సద్వినియోగం చేసుకునే విధంగా సాగునీటి పారుదల శాఖ అధికారుల పనితీరు ఉండాలన్నారు.

ప్రభుత్వం విద్య పైన ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఉపముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో ఎంత అవసరమైతే అంత నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభమైన మొదటి రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ ఇచ్చింది ఈ ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించడానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో నిధులు కేటాయించామన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ దేశానికి ఒక మోడల్ గా అద్భుతంగా నిర్మాణం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లాలో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు వెంటనే భూములను గుర్తించాలన్నారు. ఏడాదిలోగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ద్వారా అందిస్తున్న ఓవర్సీస్ స్కాలర్షిప్ సంఖ్యను మరో వందకు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

సమీక్షలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సమస్యలు అధిగమించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగుకు వచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అగ్రిమెంట్ ప్రకారం పనుల పూర్తికి అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యకు ఎన్ని నిధులైనా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పట్టుదలతో ఉందన్నారు.

సమీక్షలో రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పాలేరుకు సంబంధించి 20 కోట్ల ఖర్చుతో 18 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించవచ్చన్నారు. సీజన్ లో ప్రస్తుతమున్న సాగునీటి ప్రాజెక్టుల మరమ్మత్తులు, చిన్న చిన్న పనులు పూర్తి స్థాయిలో చేసి, వాటి పూర్తి సామర్థ్యంతో చిట్ట చివరి ఆయకట్టుకు నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంవత్సరం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధన అభివృద్ధి పరచాలని తెలిపారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాల కల్పన దిశగా చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కల్గించి, నమోదులు పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, విద్యా శాఖలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలచే పాఠశాలల అభివృద్ధి పనులు, ప్రభుత్వ పాఠశాలల్లో నమోదులు పెరిగేలా చేపడుతున్న చర్యల గురించి వివరించారు.

ఈ సమావేశంలో సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యే లు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, ఉపముఖ్యమంత్రి ఓఎస్డీ కృష్ణ భాస్కర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఇర్రిగేషన్ సిఇ విద్యాసాగర్, డిఇఓ సోమశేఖరశర్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం

- 49 మంది మృతి.. 50 మందికి గాయాలు
- ప్రమాదంలో 40 మంది భారతీయుల సజీవ దహనం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ

**విశ్వంభర, కువైట్:** గల్ఫ్ దేశం కువైట్ లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 49 మంది సజీవ దహనం కాగా, వారిలో 40 మంది భారతీయులు ఉన్నారు. 50 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలోనూ 30 మంది వరకు భారతీయులు ఉన్నట్లు గుర్తించారు. మంగాఫ్ ప్రాంతంలోని ఓ కంపెనీకి చెందిన భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో, కార్మికులు ఆ భవనంలో చిక్కుకుపోయారు. ఆరు అంతస్తుల ఆ భవనంలో 160 మంది వరకు కార్మికులు నివాసం ఉంటున్నారు. వంట గదిలో మొదలైన మంటలు నిమిషాల వ్యవధిలో మొత్తం పాకి పోయాయి. తప్పించుకునే వీల్లేక కార్మికులు మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు ఈ ప్రమాద ఘటన చోటుచేసుకుంది.

**ప్రధాని మోడీ దిగ్భ్రాంతి**

కువైట్ అగ్నిప్రమాదంలో పదుల సంఖ్యలో భారతీయులు మృతి చెందడం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ట్వీట్ చేశారు. కువైట్ లోని భారత దౌత్య కార్యాలయం ఈ ప్రమాద ఘటన, తదనంతర పరిణామాలను నిశితంగా పరిశీలిస్తుందని పేర్కొన్నారు.

# ఒడిశా సీఎంగా మోహన్ చరణ్ ప్రమాణం

- రాష్ట్రానికి 15వ ముఖ్యమంత్రి బాధ్యతలు
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు
- ఒడిశాలో బీజేడీ చిత్తుగా ఓడించిన బీజేపీ
- రెండున్నర దశాబ్దాల పాలనకు ముగింపు



**విశ్వంభర, ఒడిశా:** ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. ఒడిశా ముఖ్యమంత్రిగా మోహన్ చరణ్ మాఝీ ప్రమాణ స్వీకారం చేశారు. రెండున్నర దశాబ్దాలుగా ఒడిశాను ఏలిన బీజేడీ పాలనకు ముగింపు పలుకుతూ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బుధవారం గవర్నర్ రఘుబర్ దాస్ బుధవారం ఆయన చేత ప్రమాణం చేయించారు. మోహన్‌తో పాటు కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రవతి పరీదా ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బీజేపీ నేత రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవడం ఇదే తొలిసారి. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో ఈ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ సహా పలువురు కేంద్రమంత్రులు, కీలక నేతలు హాజరయ్యారు. కనక్ వర్ధన్ సింగ్ దియో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు.

**బిజు జనతా దళ్‌ను చిత్తు చేసిన బీజేపీ**

మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా వచ్చారు. అంతకు ముందు స్వయంగా మోహన్ చరణ్ నవీన్ పట్నాయక్ ఇంటికి వెళ్లి ఆహ్వానం అందించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 147 సీట్లకు గానూ బీజేపీ 78 చోట్ల విజయం సాధించింది. రెండున్నర దశాబ్దాలపాటు రాష్ట్రాన్ని పాలించిన నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ ఘోర పరాజయం పాలైంది. బిజు జనతాదళ్ 51, కాంగ్రెస్ 14, ఇతరులు 4 చోట్ల గెలుపొందారు. ముఖ్యమంత్రి అభ్యర్థి పేరును చెప్పకుండానే ఎన్నికల్లో దిగిన బీజేపీ.. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లను కైవసం చేసుకుంది. లోక్‌సభ స్థానాల్లో కూడా బీజేపీ అత్యధిక స్థానాలు దక్కించుకోవడం గమనార్హం. మొత్తం 21 లోక్‌సభ స్థానాలకుగాను 20చోట్ల కాషాయ పార్టీ విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ ఒక స్థానం దక్కించుకుంది.






# వందే భారత్ రైళ్లపై రాళ్ల దాడి

- రైలు అద్దాలు ధ్వంసం
- ఫగ్వారా ప్రాంతంలో ఘటన



**విశ్వంభర, పంజాబ్:** వందే భారత్ రైలుపై కొందరు రాళ్లు రువ్వారు. ఈ సంఘటనలో ఒక కోచ్‌లోని కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ కోచ్‌లోని ప్రయాణికులు ఆందోళన చెందారు. పంజాబ్‌లో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉదయం అమృత్‌సర్ నుంచి ఢిల్లీ వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై ఫగ్వారా ప్రాంతంలో రాళ్లు రువ్వారు. దీంతోసీ 3 కోచ్‌లోని రెండు విండో గ్లాస్‌లు పగుళ్లిచ్చాయి. పెద్ద శబ్దానికి అక్కడ కూర్చొన్న ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. అయితే ఎవరికీ ఏమీ జరుగకపోవడంతో ఊరట చెందారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న వందే భారత్ రైలు సిబ్బంది ఆ కోచ్ వద్దకు చేరుకున్నారు. రాళ్ల దాడిలో ధ్వంసమైన కిటికీ అద్దాలను పరిశీలించారు. కొందరు పిల్లలు రాళ్లు విసిరినట్లు ప్రయాణికులు ఆరోపించారు. అయితే ఈ సంఘటనలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో వందే భారత్ రైలుపై రాళ్ల దాడి జరుగడం ఇదే తొలిసారని వెల్లడించారు.

# ఏక వ్యక్తి పాలనకు విముక్తి

## ఓటర్ల బలంతోనే ఈ మార్పు సాధ్యం

### ఎన్సీపీ (ఎస్సీ) అధినేత శరద్ పవర్

**విశ్వంభర, పూణే:**



ఇతర పార్టీల సహాయం లేకుండా కేంద్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సాధ్యం కాదని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అన్నారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఉన్నందున మోడీ హామీ ముగిసిందని తెలిపారు. ఓటర్ల బలంతోనే ఈ మార్పు సాధ్యమైందని చెప్పారు. పూణెలో బుధవారం జరిగిన ఓ సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'లోక్ సభ ఎన్నికలు ముగిశాయి. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. గత పదేళ్లలో ప్రభుత్వం ఒక వ్యక్తి చేతుల్లో బందీ అయింది. కానీ ఇప్పుడు ఆ వ్యవస్థ నుంచి విముక్తి లభించింది. ఈసారి ఇతరుల సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు' అని అన్నారు. నితీశ్, చంద్రబాబుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏర్పాటయ్యేదే కాదన్నారు. కాబట్టి మోడీ గ్యారంటీలకు కాలం చెల్లిందని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు రాష్ట్ర ప్రజల చేతుల్లో అధికారం ఉంటుందని, క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. మహా వికాస్ అఘాడీ కూటమికి ప్రజలు అండగా ఉన్నారని శరద్ పవార్ స్పష్టం చేశారు.

# ఎటూ తేల్చుకోలేకపోతున్నా

- డైలమాలో రాహుల్ గాంధీ
- ఏ స్థానం నుంచి ఎంపీ కొనసాగాలో అర్థం కావట్లేదు
- ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ప్రజలకు మేలు చేస్తా



**విశ్వంభర, వయనాడ్:** లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపించిన వయనాడ్ ప్రజలకు ధన్యవాదాలు తెలియచేస్తున్నానని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వయనాడ్‌లో బుధవారం జరిగిన బహిరంగసభను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. వయనాడ్ లేక రాయ్‌బరేలి ఎంపీగా ఉండాలా అనే డైలమాలో తానున్నానని చెప్పారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్ పార్లమెంటు స్థానాల నుంచి రాహుల్ గాంధీ గెలుపొందారు. ఈ నేపథ్యంలోనే ఏ స్థానాన్ని ఎంపిక చేసుకోవాలో తేల్చుకోలేకపోతున్నానని రాహుల్ అన్నారు. తాను ఏ నిర్ణయం తీసుకున్నా రెండు నియోజకవర్గాల ప్రజలు ఆనందిస్తారని చెప్పారు. రెండు నియోజకవర్గాల ప్రజలు హర్షించే నిర్ణయం తీసుకుంటానని అన్నారు. దురదృష్టవశాత్తూ ప్రధాని మోడీ మాదిరిగా తనను భగవంతుడు నడిపించడం లేదని, తాను మామూలు మనిషినని పేర్కొన్నారు. తనను పరమాత్మే ఈ లోకానికి పంపారని ప్రధాని మోడీ చెప్పారని రాహుల్ గుర్తుచేశారు. కానీ మోడీ పరమాత్మ అన్ని నిర్ణయాలను అదానీ, అంబానీలకు అనుకూలంగా తీసుకుంటారని ఎద్దేవా చేశారు. ముంబై ఎయిర్‌పోర్ట్, లక్నో ఎయిర్‌పోర్ట్, పవర్ ప్లాంట్‌లను అదానీకి కట్టబెట్టాలని ఆ పరమాత్మ మోదీని కోరారని చెప్పారు. తనకు దేశంలోని పేదలందరూ, వయనాడ్ ప్రజలే దేవుళ్లని రాహుల్ పేర్కొన్నారు.




# బాబు ఈజ్ బ్యాక్



విశ్వంభర, విజయవాడ: గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్కులో బుధవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ప్రముఖ రాజకీయ నేతలు, సినీ నటులు, అశేష జనవాహిని మధ్య చంద్రబాబుతో ఉదయం 11.30 తర్వాత రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. చంద్రబాబు ప్రమాణం తర్వాత పవన్ కల్యాణ్ మంత్రిగా ప్రమాణం చేశారు. ఇప్పటి వరకు కలిపి నాలుగుసార్లు చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. చంద్రబాబుతో పాటు 24 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

**మంత్రులుగా ప్రమాణం చేసింది వీరే**

టీడీపీకి 21, జనసేనకు 3, బీజేపీ 1 మంత్రి పదువుల కేటాయించారు. టీడీపీలో సామాజిక కూర్పు చూస్తే 21 మందిలో ఐదుగురు కమ్మ, ఒకరు కాపు, ఒకరు వైశ్య, ఒకరు ఎస్టీ, ఒకరు మైనార్టీ, ఇద్దరు ఎస్సీ, ముగ్గురు రెడ్డి, ఏడుగురు బీసీ సామాజికవర్గాలకు చెందిన వారికి మంత్రులుగా అవకాశం దక్కింది. చంద్రబాబు, పవన్ తర్వాత ఆయా పార్టీల నుంచి మంత్రులుగా ఎంపికైన వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఇక టీడీపీ నుంచి నారా చంద్రబాబు నాయుడు (ముఖ్యమంత్రి ), నారా లోకేష్ (కమ్మ), కింజరాపు అచ్చెన్నాయుడు (బీసీ), కొల్లు రవీంద్ర (బీసీ), పి.నారాయణ (కాపు), వంగలపూడి అనిత (ఎస్సీ), నిమ్మల రామానాయుడు (కమ్మ), ఎన్ఎండీ ఫరూక్ (ముస్లీం), ఆనం రామనారాయణరెడ్డి (రెడ్డి), పయ్యావుల కేశవ్ (కమ్మ), అనగాని సత్యప్రసాద్ (బీసీ), కొలుసు పార్థసారధి (బీసీ), డోలా బాలవీరాంజనేయస్వామి (ఎస్సీ), గొట్టిపాటి రవి (కమ్మ), గుమ్మడి సంధ్యారాణి (ఎస్టీ), బీసీ జనార్ధన్ రెడ్డి (రెడ్డి), టీజీ భరత్ (వైశ్య), ఎస్.సవిత (బీసీ), వాసంశెట్టి సుభాష్ (బీసీ), కొండపల్లి శ్రీనివాస్ (బీసీ), మండపల్లి రాంప్రసాద్ రెడ్డి (రెడ్డి) మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన నుంచి పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నుంచి సత్య కుమార్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు.

**మెగా బ్రదర్స్ తో మోడీ అభివాదం**

ప్రమాణ స్వీకారం చేసిన వేదికపై ఆత్మీయ ఆలింగనాలు, అభిమాన సంకేతాలు, ఘటనలు కనిపించాయి. అయితే అన్నింటికన్నా కూడా ఓ ఘటన మాత్రం తెలుగు రాష్ట్రాలను ఊపేస్తోంది. అదే మెగా బ్రదర్స్ తో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన పని. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అయితే ప్రమాణ స్వీకార కార్యక్రమం మధ్యలో ఓ ప్రత్యేక ఘటన జరిగింది. స్టేజిపై ఓ వైపు ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ పవన్ కల్యాణ్ తో మాట్లాడుతూ.. ఇంకో వైపు ఉన్న చిరంజీవి వద్దకు వచ్చారు.

**బాబు ముఖ్య కార్యదర్శిగా ముద్దాడ రవిచంద్ర**

సీనియర్ అధికారి ముద్దాడ రవిచంద్రను చంద్రబాబు ముఖ్య కార్యదర్శిగా అపాయింట్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, మాజీ సీఎం జగన్ పేషీలో పని చేసిన అధికారులను ప్రభుత్వం ఎన్నికల ఫలితాల అనంతరం బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో సీఎంవో ఖాళీ అయ్యింది. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించడంతో తాజాగా సీఎంవోలో అధికారులను నియమిస్తున్నారు.

## మంత్రిగా పవన్ ప్రమాణం.. మార్మోగిన సభ ప్రాంగణం

బాబు తర్వాత జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆంధ్ర ప్రదేశ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మొదటిసారి పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. మొదటిసారే మంత్రి కాబోతున్నారు. దీంతో జనసైనికులు, పవన్ ఫ్యాన్స్ లో ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. పవన్ కల్యాణ్ స్టేజి మీద ప్రమాణ స్వీకారం చేసే సమయంలో ఫ్యాన్స్ అరుపులతో ప్రాంగణం మొత్తం మార్మోగిపోయింది. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవితో పాటు రామ్ చరణ్, సాయిధరమ్ తేజ్‌తో పాటు మెగా ఫ్యామిలీ మొత్తం తరలి వచ్చింది. మెగా ఫ్యామిలీ ప్రత్యేకంగా బస్ లో ఈ వేడుకకు వచ్చింది. ఇక తండ్రి కోసం అకీరా, ఆద్యలు కూడా తరలి వచ్చారు. వారిద్దరూ కూడా సంప్రదాయ బద్ధంగా రెడీ అయ్యారు. అకిరా పంచె కట్టగా.. ఆద్య ఎంతో చక్కగా ట్రెడిషనల్‌గా కనిపిస్తుంది. వీరిద్దరి ఫొటోలను షేర్ చేస్తూ రేణూ దేశాయ్ ఓ పోస్టు చేసింది. పవన్ కల్యాణ్ కు స్పెషల్ విషెస్ తెలిపింది. "నా పిల్లలు వాళ్ల నాన్న బిగ్గెస్ట్ డే రోజు ఇలా రెడీ అయ్యారు. కళ్యాణ్ గారికి ఏపీ స్టేట్ కి .. ప్రజలకు మంచి చేయాలని శుభాకాంక్షలు" అంటూ పోస్ట్ చేసింది. దాంతో ఆమె పోస్టును కాస్త మెగా అభిమానులు వైరల్ చేస్తున్నారు.

## హాజరైన ప్రముఖ రాజకీయ నేతలు, సినీ నటులు

ఈ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వైద్యం-ఆరోగ్య శాఖా మంత్రి జేపీ నడ్డా, కేంద్ర సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి జీతన్ రామ్ మాంఝీ, కేంద్ర ఆహార ఉత్పత్తుల శాఖా మంత్రి చిరాగ్ పాశ్వాన్, కేంద్ర రోడ్ల రవాణా-ప్రధాన రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వీ.రమణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర స్కిల్ డెవలప్మెంట్ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి, కేంద్ర సహాయ కామర్స్ అండ్ ఇండస్ట్రీ శాఖ మంత్రి అనుప్రియా పటేల్, సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ సహాయ శాఖ మంత్రి రామ్ దాస్ అథవాలే, రాజ్యసభ ఎంపీ ప్రఫుల్ పటేల్, మాజీ గవర్నర్ తమిళిసై, తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వం పాల్గొననున్నారు. వీరితో పాటు పలువురు సినీ ప్రముఖులు కూడా పాల్గొననున్నారు. మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేడు బాధ్యతలు.. తొలి సంతకంపై సర్వత్రా ఆసక్తి

ఇవాళ సాయంత్రం 4గంటల 41 నిమిషాలకు సీఎం చాంబర్‌లో చంద్రబాబు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక చంద్రబాబు తొలి సంతకం దేనిపైన అనేది అత్యంత ఆసక్తికరంగా మారింది. కాగా, మెగా డీఎస్సీ ఫైల్ పైనే చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో తొలి సంతకం చేయనున్నారు అని తెలుస్తోంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు ఫైల్ పై రెండో సంతకం, సామాజిక పెన్షన్ రూ. 4వేలకు పెంపు ఫైల్ పై మూడో సంతకం చేస్తారని తెలుస్తోంది. డీఎస్సీ పై తొలి సంతకం చేస్తానని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. టీడీపీ విజయానికి దోహదపడిన మూడు నాలుగు అంశాల్లో ప్రధానంగా ఉన్న అంశం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు ఫైల్ పై చంద్రబాబు రెండో సంతకం పెట్టబోతున్నారు. ఇక మూడో సంతకం.. సామాజిక పెన్షన్ రూ.4వేలకు పెంపు ఫైల్ పై పెట్టబోతున్నారు. స్కిల్ సెన్సెస్ ప్రక్రియను చేపట్టడం, అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సంబంధించిన ఫైల్స్ పైన సంతకం చేయనున్నట్లు తెలుస్తోంది.

# విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపేట

## రాష్ట్ర పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



విశ్వంభర, వరంగల్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాకి పెద్దపేట వేస్తున్నదని రాష్ట్ర పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఖిలా వరంగల్లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా మంత్రి సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ అలుబెల్లి నర్సిరెడ్డి, జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బడిబాట కార్యక్రమం గోడ ప్రతిని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి కొండ సురేఖ మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు చేపడుతున్నదని అన్నారు. అందులో భాగంగా కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపుతుందన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన వసతులతో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తున్నదని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో వసతులు, సదుపాయాలతో పాటు బోధనలో విప్లవాత్మక చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి ఎందరో ఉన్నత శిఖరాలు సాధించారన్నారు. తాను, వరంగల్ జిల్లా కలెక్టర్ కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారే అని మంత్రి గుర్తు చేశారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలను సెమి రెసిడెన్షియల్ స్కూల్స్ గా చేయుటకు ముఖ్యమంత్రి ఆలోచనలో ఉందని అన్నారు. అమ్మల భాగస్వామ్యం ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటుచేసి పాఠశాలల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని అన్నారు. దీంతోపాటు మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మహిళలచే యూనిఫాంలో కుట్టించడం జరిగిందని తెలిపారు.

విద్యార్థులలో ప్రతిభను వెలికి తీసి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా చూడాల్సిన గురుతరమైన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన ప్రభుత్వ పాఠశాలల్లో 20 కోట్ల రూపాయల వ్యయంతో మౌలిక వసతులు కల్పించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.

నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి మాట్లాడుతూ మీ డబ్బులు మీ వద్దే మీ పిల్లల భవిష్యత్తు మా వద్ద అని నిదానంతో మంత్రి రేవంత్ రెడ్డి ముందుకెళుతున్నారని అన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైన మొదటి రోజే రాష్ట్రంలో ఎన్నడు జరగని విధంగా పాఠ్యపుస్తకాలు, నోట్బుక్లు, యూనిఫామ్ లు విద్యార్థులకు అందించడం ముఖ్యమంత్రికి విద్య పట్ల ఉన్న ఆసిక్తి నిదర్శనమని అన్నారు. వరంగల్ మహా నగర పాలక సంస్థ తరపున ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ ఎడ్యుకేషన్ ఏర్పాటుకు సహకారం అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ అలుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడులు నిలబడాలి విద్యతోనే అంతరాలు పోవాలని, ఆర్థిక సామాజిక అంతరాలను తగ్గించేదే విద్య అని తెలిపారు. చదువును కొనకండి, చదువుకోండని, ప్రభుత్వ పాఠశాలలోనే విద్య అభ్యసించాలని కోరారు. బడులలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు మున్సిపాలిటీలు గ్రామపంచాయతీలతో కాక స్వయంగా నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బడులు ప్రారంభమైన బుధవారం రోజున ప్రభుత్వ నుండి అందిన 2.15 లక్షల పాఠ్య, 2.48 లక్షల నోట్ బుక్ లతో పాటు మహిళ సంఘాలచే కుట్టించిన 38 వేల ఏకారుప దుస్తులు విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన సుమారు 448 పాఠశాలల అభివృద్ధి పనులలో 130 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులు పూర్తయ్యాయని, మిగిలిన పాఠశాలల్లో 90 శాతం పనులు పూర్తయినాయని, వారంలోగా వంద శాతం పుర్తవుతాయని అన్నారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న ఐదేళ్ల పై బడిన 7 వేల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా పిల్లలను నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే నమోదు చేసేలా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఈఓ వాసంతి, విద్యా శాఖ అధికారులు, మెప్మా, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బీరు వర్సెస్ పాత బీరు

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో ఆల్కహాల్ శాతం తక్కువగా ఉండటమే కాకుండా రుచికరంగా ఉండడం వల్ల చాలామందిలో ముఖ్యంగా యువత కింగ్ ఫిషర్ లైట్ ను ఎక్కువగా ఇష్టపడుతారు. ఇప్పుడు విషయం ఏమిటంటే కొంత కాలంగా కింగ్ ఫిషర్ లైట్ బీర్ కు మార్కెట్లో కొరత వచ్చేసింది. కారణం ఏమిటంటే కంపెనీ ఈ బీరు ఉత్పత్తిని బాగా తగ్గించేసింది. ఎందుకంటే ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు పేరుకు పోతుండటంతో యాజమాన్యం నిరసనగా కింగ్ ఫిషర్ బీర్ ఉత్పత్తిని బాగా తగ్గించేసింది. లిక్కర్ అంటే బ్రాందీ, విస్కీ, వోడ్కా, జిన్ లాంటి రకాలతో పాటు బీర్లు, వైన్ తయారుచేస్తున్న కంపెనీలకు ప్రభుత్వం సుమారు రూ. 2 వేల కోట్ల బకాయిలు పడింది.

**బకాయిల సుమారు రూ. 2 వేల కోట్లు!**

2023 ఎన్నికలకు ముందే ఈ బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు ఎందుకు పేరుకుపోయాయంటే అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం డిస్టలరీలు, బ్రూవరీలకు ప్రతి 45 రోజులకు చెల్లించాల్సిన డబ్బులను చెల్లించలేదు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా చూపించి డబ్బులు చెల్లించలేదు. ఎన్నికల కోడ్ సుమారు 2 నెలలకు పైగా సాగింది. దీంతో బకాయిలు పెరిగిపోయాయి. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ పెట్టిన బకాయిలను తామెందుకు చెల్లించాలన్న ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బకాయిలను అలాగే ఉంచేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కంపెనీలు చేసిన సరఫరాకు మాత్రం ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లిస్తుంది. అయితే బకాయిలు మాత్రం అలాగే ఉండిపోయాయి. ఇంతలో పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో చెల్లింపులకు మళ్ళీ కోడ్ అడ్డొచ్చింది. పార్లమెంటు ఎన్నికల కోడ్ కూడా సుమారు 2 నెలలు కంటిన్యూ అవడంతో ఇప్పుడు కూడా బకాయిలు పేరుకుపోయి. మొత్తం సుమారు రూ. 2 వేల కోట్లకు చేరుకుంది.

**దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం**

ఈ మొత్తం బకాయిల్లో మేజర్ షేర్ బీర్ల సరఫరాకు సంబంధించిన బకాయిలే ఉన్నాయి. బకాయిలను రాబట్టుకునేందుకు బ్రూవరీలు బీర్ల ఉత్పత్తిని తగ్గించేశాయి. బండలు కూడా పగిలిపోయే ఎండాకాలంలో మద్యం ప్రియుల్లో ఎక్కువమంది బీర్లు తాగటానికే మొగ్గుచూపుతారు. అలాంటిది మార్కెట్లు బీర్ల(కింగ్ ఫిషర్ లైట్)కొరత ఎక్కువైపోవడంతో పరోక్షంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిపోయింది. అందుకనే కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం ఇతర రాష్ట్రాల్లో బీర్లను ఉత్పత్తి చేస్తూ తెలంగాణలో సరఫరా చేసే పద్ధతిలో దరఖాస్తులను ఆహ్వానించింది. మొత్తం ఆరు కంపెనీలు దరఖాస్తులు చేసుకుంటే 5 కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అయితే ఏ కంపెనీకి పర్చేజింగ్ ఆర్డర్ మాత్రం ఇవ్వలేదు. ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న కంపెనీలో మధ్యప్రదేశ్ కు చెందిన సోమ్ బ్రూవరీ కూడా ఒకటి. ఈ బ్రూవరీ కంపెనీ మీదే తెలంగాణాలో బాగా నెగిటివ్ గా ప్రచారం జరిగింది. దీంతో ఆ కంపెనీ కూడా అదే పద్ధతిలో లోకల్ కంపెనీలపైన ఎదురుదాడికి దిగింది. దీంతో మొత్తం వ్యవహారమంతా కంపైపోవటంతో ప్రభుత్వం అన్నీ కంపెనీలను హోల్డ్ లో పెట్టింది. అంటే ఏ కంపెనీ నుంచి కూడా బీర్లను ఇప్పటివరకు కొనలేదు.

**సీజన్ మారిపోతే బీర్ల డిమాండ్ తగ్గుతుంది!**

లోకల్ బ్రూవరీలు బీర్ల ఉత్పత్తిని పెంచకపోగా బయటనుండి సరఫరా చేస్తామని వచ్చిన కంపెనీలపై చెడు ప్రచారం మొదలు పెట్టాయనే ఆరోపణలు పెరిగిపోతున్నాయి. ఎండాకాలంలో బీర్లకుండే డిమాండ్ అంతా ఇంతాకాదు. ఈ సీజన్ లో రోజుకు 1.2 లక్షల కేసుల బీర్లు ఉత్పత్తి అవ్వాల్సి ఉండగా.. ఇప్పుడు 60 వేల కేసులు మాత్రమే అవుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అలాంటి వేసవి సీజన్లో డిమాండుకు తగ్గట్లుగా బీర్ల ఉత్పత్తి జరగలేదన్నది వాస్తవం. సీజన్ మారిపోతే బీర్ల డిమాండు కూడా తగ్గిపోతుంది. అయితే ఇప్పుడు సీజన్ మారుతున్నా ఎండలు ఎక్కువగానే ఉంటున్నాయి కాబట్టే బీర్లకు డిమాండ్ తగ్గలేదు. బకాయిలు చెల్లిస్తే కానీ బీర్ల ఉత్పత్తిని అవసరానికి తగ్గట్లుగా చేయమని కంపెనీలు గట్టిగా పట్టుబట్టాయి. డిమాండును తట్టుకోవటానికి బయట కంపెనీలతో ఉత్పత్తి చేయించి తెలంగాణాలో సరఫరాకు అనుమతివ్వాలన్న ప్రభుత్వ ప్రయత్నం ఆగిపోయింది. ఈ వివాదంలో డీలర్లు, రీటైలర్లు. జనాలు ఇబ్బంది పడుతున్నారు.




**బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ ఏమన్నారంటే..**

ఇదే విషయమై బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ అబ్రహం మాట్లాడుతూ... 'బీర్ల తయారీ కంపెనీ యూబీకి ప్రభుత్వానికి మధ్య వివాదం వచ్చిందన్నారు. 'బీర్లు, లిక్కర్ తయారుచేస్తున్న కంపెనీలకు ప్రభుత్వం నుండి రు. 1500 కోట్ల బకాయిలు ఉంద'ని చెప్పారు. 'నెలకు 50 లక్షల కేసుల బీర్లు తయారవుతుంటే యూబీ కంపెనీ తయారుచేస్తున్న కింగ్ ఫిషర్ లైట్ బ్రాండ్ వాటా 20 శాతం ఉంటుందన్నారు. 'బయటరాష్ట్రాల్లో బీర్ ను ఉత్పత్తిచేసి తెలంగాణలో సరఫరా చేసినట్టుగా ఐదు కంపెనీలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని హోల్డులో పెట్టిందన్నారు. బయట కంపెనీలతో ప్రభుత్వం బీర్ల సరఫరాకు ఒప్పందం చేసుకోగానే యూబీ కంపెనీ బీర్ సరఫరా విషయంలో ప్రభుత్వంతో చర్చలు మొదలు పెట్టిందన్నారు. బకాయిలు చెల్లించే విషయాన్ని ప్రభుత్వమే చెప్పాలన్నారు. వివాదం తొందరగా ముగిసిపోతుందన్న ఆశాభావాన్ని అబ్రహం వ్యక్తంచేశారు.

# అంతు చిక్కని రహస్యం..!

- చెట్టు వేరు నుంచి ధారాళంగా నీరు
- మహా శివుడి మహిమ అని భక్తుల నమ్మకం
- వేలేరుపాడు కట్కూరులో అద్భుతం

విశ్వంభర, కుక్కునూరు : ప్రకృతి మానవాళికి ఒక వరం.. చెట్లు..మొక్కలు లేని భూ ప్రపంచాన్ని మచ్చుకైనా ఊహించుకోలేం. భూమిపై మనిషి ఉన్నంత కాలం చెట్లు.. పక్షులు ఉండాల్సిందే. చెట్లు ఇచ్చే ఆక్సిజన్ కు పీల్చుకొని మనం జీవనం సాగిస్తున్నాం. అయితే ప్రకృతిలో ఎన్నో వింతలు మనం చూస్తూ ఉంటాం. విభిన్నంగా ఉండే చెట్లు..రకరకాల మొక్కలు అప్పుడప్పుడు కనిపిస్తూ అద్భుతం అనిపిస్తాయి. ఇప్పుడు మనం చెప్పుకుంటున్న చెట్టు కూడా అటువంటి కోవలోదే.

ఎందుకంటే దాని ప్రత్యేకత తెలిస్తే దేవుడి సృష్టికి కచ్చితంగా దండం పెట్టాల్సిందే అంటారు. సాధారణంగా చెట్లు స్వచ్ఛమైన ఆక్సిజన్ ఇస్తాయని అందరికీ తెలుసు. కానీ స్వచ్ఛమైన నీరు ఇస్తుందంటే అది అద్భుతం కాక ఇంకేమిటి.

ఇదేదో మానవ సృష్టి, టెక్నాలజీ పెరిగిన ఈరోజుల్లో ఇటువంటి వింతలు విశేషాలు మామూలే అని కొట్టిపారేస్తా రేమో. అలా అనుకుంటే పొరపాటే. ఇది కచ్చితంగా ప్రకృతి వింత.. ఏలూరు జిల్లా వేలేరుపాడు ఏజెన్సీ ప్రాంతంలో కట్కురు అనే గ్రామంలో ఒక చెట్టు వేరు నుంచి నిరంతరాయంగా నీరు వస్తోంది. చెట్టు వేరు నుంచి ధారాళంగా నీరు రావడం ఎంటి అనే కదా అందరూ అనుకునేది. కానీ ఇక్కడ అటువంటి అద్భుతమే కనిపిస్తోంది. ఆంధ్రా కాశ్మీర్ లా ప్రకృతి అందాలతో ఆహ్లాదాన్ని పంచే ఏలూరు ఏజెన్సీలో అంతు చిక్కని ఈ రహస్యం దాగి ఉంది. ఇక్కడ ఉండే మహా శివుడి ఆలయం సమీపంలో ఈ చెట్టు ఉంది. ఏళ్ల క్రితం నుంచి ఈ వృక్షం కింద వేరు నుంచి ధారాళంగా నీరు రావడం వింత అనుభూతి కలిగిస్తోంది. ఎక్కడ నుంచి నీరు వస్తుందో ఎవరికీ అంతుబట్టడం లేదు.

కాలాలలో పనిలేకుండా నిరంతరం ఈ చెట్టు వేరు నుంచి నీరు రావడం అటు పర్యాటకులను, ఇటు భక్తులను ఆకట్టుకుంటోంది. స్వచ్ఛమైన ఈ నీరు తాగితే రోగాలు మటుమాయం అవుతున్నాయని భక్తుల నమ్మకం. మొదట్లో ఈ చెట్టు వేరు నుంచి వస్తున్న నీటిని చూసిన స్థానికులు కొండ కోనల్లో నుంచి నీరు వస్తుందనీ భావించారు. మండు వేసవిలో సైతం నీరు అలాగే రావడం చూసి ఆ నీరు ఎలా వస్తుందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆ అద్భుత రహస్యం నేటి వరకూ ఎవరికి అంతుబట్టడం లేదు. ఇక్కడ సమీపంలో మహా శివుడి ఆలయం ఉండటం..పక్కనే చెట్టు వేరు నుంచి ధారాళంగా నీరు రావడం దేవుడి మహిమ అని భక్తులు నమ్ముతున్నారు.

పచ్చని అందాలతో అలరారుతున్న ఈ ఏజెన్సీ ప్రాంతం ఇప్పుడు అంతు చిక్కని రహస్యాలను కూడా తనలో నిక్షిప్తం చేసుకుంది. అనేక ఏళ్ల నాటి నుంచి ఈ చెట్టు వేరు నుంచి నీరు వస్తుందనీ, ఇక్కడికి వచ్చే పర్యాటకులు, భక్తులు విశ్వాసంతో ఈ నీటిని తాగుతారు. చుట్టూ ఎత్తైన కొండలు, కోనల నడుమ ప్రకృతి అందాలతో విలసిల్లే ఈ కట్కూరు ప్రాంతం లో ఇటువంటి వింత అందరినీ కట్టి పడేస్తుంది అనడంలో సందేహం లేదు.



## టాప్‌లో మళ్లీ మిస్టర్ 360

- టీ20 ర్యాంకింగ్స్ భారత ప్లేయర్లు హవా
- టాప్ 10లో వచ్చిన యశస్వీ




**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమిండియా స్టార్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్ ర్యాంకింగ్‌లో మరోసారి అగ్రస్థానం నిలబెట్టుకున్నాడు. ఐసీసీ తాజాగా ప్రకటించిన బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మిస్టర్ 360 సూర్య నంబర్ 1గా ఉన్నాడు. టీ20ల్లో మెరుపు బ్యాటింగ్‌కు కేరాఫ్ అయిన భారత కుర్రాడు యశస్వీ జైస్వాల్ టాప్ 10లో చోటు దక్కించుకున్నాడు. ఐపీఎల్ 17వ సీజన్‌లో ఉతికేసిన యశస్వీ 700 పాయింట్లతో ఆరో స్థానం సంపాదించాడు. ఇంగ్లండ్ విధ్వంసక ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ రెండో స్థానంలో, పాకిస్థాన్ సారథి బాబర్ ఆజాంలు మూడో స్థానంలో నిలిచారు. దక్షిణాఫ్రికా నుంచి మర్కరమ్, క్లాసెన్, వెస్టిండీస్ నుంచి బ్రాండన్ కింగ్.. ఆస్ట్రేలియా తరఫున ట్రావిస్ హెడ్‌లు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మెరిశారు.

**బౌలింగ్ ర్యాకింగ్ తొలిస్థానంలో ఆదిల్ రషీద్**

బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ నంబర్ 1 స్థానం కైవసం చేసుకున్నాడు. శ్రీలంక కెప్టెన్ వనిందు హసరంగ రెండో స్థానంలో ఉండగా.. భారత స్పిన్నర్లు ఇద్దరూ టాప్ 10లో నిలిచారు. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ 7వ స్థానంతో, లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌లు 10వ స్థానంతో సరిపెట్టుకున్నారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో అఫ్గనిస్థాన్ మాజీ కెప్టెన్ మహ్మద్ నబీ నంబర్ 1 ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. భారత వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా 8వ ప్లేస్ సొంతం చేసుకున్నాడు.





# శ్రీలంకను ముంచేసిన వర్షం

## టీ20 ప్రపంచ కప్ నుంచి ఔట్!

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 వరల్డ్ కప్2024లో భాగంగా ఫ్లోరిడా వేదికగా నేడు జరగాల్సిన శ్రీలంకనేపాల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో శ్రీలంక లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టనుంది. గ్రూప్ డీలో ఉన్న శ్రీలంక.. దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌తో జరిగిన మొదటి రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. బుధవారం నేపాల్‌తో జరగాల్సిన మ్యాచ్‌లో నెగ్గి సూపర్ 8 రేసులో నిలవాలనుకున్న శ్రీలంక ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. ఫ్లోరిడాలో జరగాల్సిన ఆ మ్యాచ్ వర్షం కారణంగా టాస్ పడకుండానే రద్దయింది. కనీసం ఐదు ఓవర్ల ఆటను నిర్వహించాలనుకున్నా సాధ్యపడలేదు. చివరకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. దీంతో గ్రూప్ డీలో మూడు విజయాలు సాధించి 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా సూపర్ 8కు అర్హత సాధించింది.

**సూపర్-8కు చేరిన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా**

గ్రూప్ బీలో సూపర్ 8కు అర్హత సాధించిన తొలి జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది. నిన్న ఆంటిగ్వాలోని నార్త్‌సౌండ్‌లో నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత కంగారుల బౌలింగ్ ధాటికి నమీబియా 17 ఓవర్లలో 72 పరుగులకే కుప్పకూలింది. గెర్హార్డ్ ఎరాస్మస్ (36), మైఖేల్ వాన్ లింగేన్ (10) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మిగతా బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఆసీస్ స్పిన్నర్ ఆడమ్ జంపా (4/12) అదరగొట్టగా.. హేజిల్ వుడ్ 2, స్టాయినిస్ 2, కమిన్స్, నాథన్ ఎలిస్ తలో వికెట్ పడగొట్టారు. ఈ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 5.4 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే 6 పాయింట్లతో ఆస్ట్రేలియా సూపర్ 8కు చేరింది. ఈ గ్రూప్‌లోని నమీబియా (3 మ్యాచ్‌లు ఒక విజయం), ఒమన్ (3 మ్యాచ్‌లు 3 ఓటములు) లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టనున్నాయి. ఈ గ్రూప్ నుంచి స్కాట్లాండ్ రెండో జట్టుగా సూపర్ 8కు చేరే అవకాశముంది. ప్రస్తుతం ఆ జట్టు మూడు మ్యాచ్‌లు ఆడి ఐదు పాయింట్లతో ఉంది.

**డిఫెండింగ్ ఛాంపియన్ లీగ్ దశలోనే!**

గ్రూప్ బీలో ఉన్న డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లాండ్ ఈసారి లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించేలా కనిపిస్తోంది. ఇప్పటివరకు రెండు మ్యాచ్‌ల్లో ఇంగ్లిష్ జట్టు ఒక దాంట్లో పరాజయం పాలవగా.. మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఇంగ్లాండ్ సూపర్ 8కు చేరాలంటే తప్పకుండా మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో (ఒమన్, నమీబియాతో) భారీ తేడాతో గెలవాలి. దాంతోపాటు స్కాట్లాండ్ తన చివరి మ్యాచ్ ఆస్ట్రేలియాతో ఓడిపోతే సాధ్యం అవుతోంది.

## ఆస్పత్రిలో చేరిన శార్దూల్ ఠాకూర్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమిండియా ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ కుడి కాలు పాదానికి సర్జరీ చేయించుకున్నాడు. ఈ విషయాన్ని శార్దూల్ బుధవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. హాస్పిటల్‌లో ఉన్న ఫొటోను పోస్టు చేసిన అతను సర్జరీ విజయవంతమైందని తెలిపాడు. కొంతకాలంగా చీలమండల నొప్పితో బాధపడుతున్న అతను లండన్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. శార్దూల్‌కు సర్జరీ జరగడం ఇది రెండోసారి. 2019లో అతను తొలిసారిగా పాదం సర్జరీ చేయించుకున్నాడు. సౌతాఫ్రికా పర్యటనలో అతని గాయం మళ్లీ తిరగబెట్టింది. ఐపీఎల్‌లో ఇంజక్షన్ తీసుకుని పాల్గొన్నాడని, అయినప్పటికీ పరిస్థితి మెరుగుపడకపోవడంతో సర్జరీ చేయించుకున్నట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. భారత స్టార్ పేసర్ మహ్మద్ షమీ మోకాలికి సర్జరీ చేసిన డాక్టరే శార్దూల్‌కు శస్త్ర చికిత్స చేసినట్టు తెలిపాయి. శార్దూల్ కోలుకుని శిక్షణ ప్రారంభించడానికి దాదాపు మూడు నెలలు పట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# అమెరికాపై భారత్ విజయం

### 7 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ

### సూర్య కుమార్ మెరుపు ఇన్నింగ్స్

### సూపర్8కు అర్హత సాధించిన టీమిండియా

**విశ్వంభర, స్పోర్ట్స్ :**

టీ20 వరల్డ్ కప్ టీమిండియా మరో విజయకేతనం ఎగరవేసింది. అమెరికాతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్‌లో అర్ష్ దీప్ సింగ్, బ్యాటింగ్‌లో సూర్య కుమార్ యాదవ్ మెరుపులు మెరిపించడంతో అమెరికాపై భారత్ సూపర్ విక్టరీని అందుకుంది. గెలుపుతో టీమిండియా గ్రూప్ ఏ నుంచి సూపర్ 8 కు అర్హత సాధించింది. 7 వికెట్ల తేడాతో భారత్ విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా జట్టును భారత బౌలర్లు చెడుగుడు ఆడుకున్నారు. అమెరికా స్కోర్ బోర్డును 110 పరుగులకే కట్టడి చేశారు.



**బౌలింగ్‌లో అర్ష్ దీప్..**
**బ్యాటింగ్‌లో సూర్య భళ**

న్యూయార్క్‌లోని నసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు అదరగొట్టారు. అర్ష్‌దీప్ సింగ్ 4 వికెట్లు తీసుకోగా.. హార్దిక్ పాండ్యా 2, అక్షర్ పటేల్ 1 వికెట్ పడగొట్టారు. మిగతా బౌలర్లు కూడా పెద్దగా పరుగులు ఇవ్వకుండా పొదుపుగా బౌలింగ్ చేశారు. 20 ఓవర్లలో అమెరికా 8 వికెట్లకు 110 పరుగులు చేసింది. 111 పరుగుల విజయ లక్ష్యంతో టీం ఇండియా ఛేజింగ్ ను కొనసాగించింది. ఆరంభంలోనే భారత్ కు బిగ్ షాక్ తగిలింది.

**సూపర్ 8 కు అర్హత సాధించిన భారత్**

టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు పెద్దగా పరుగులు చేయకుండా ఔట్ అయ్యారు. విరాట్ కోహ్లీ గోల్డెన్ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరగా, రోహిత్ శర్మ 3 పరుగులకే ఔట్ అయ్యాడు. రిషబ్ పంత్ 18 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. ఈ క్రమంలోనే క్రీజులోకి వచ్చిన శివం దూబేతో కలిసి సూర్యకుమార్ యాదవ్ భారత్ ను విజయతీరాలకు చేర్చాడు. సూర్య కుమార్ యాదవ్ హాఫ్ సెంచరీ ఇన్నింగ్స్ ఆడాడు. 49 బంతుల్లో 50 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. అలాగే, శివం దూబే 31 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. దీంతో భారత్ 18.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 111 పరుగుల టార్గెట్ ను ఛేదించింది. ఈ గెలుపుతో టీమిండియా సూపర్ 8 కు అర్హత సాధించింది.

**పసికూన జట్టు గట్టి సవాల్**

టీ20 వరల్డ్ కప్‌లో ఫేవరెట్ టీమిండియాకు పసికూన అమెరికా గట్టి సవాల్ విసిరింది. స్వల్ప ఛేదనలో యూఎస్ఏ బౌలర్లు భారత స్టార్ ఆటగాళ్లకు ముచ్చెమటలు పట్టించారు. స్లో పిచ్‌పై కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌండరీలకు బ్రేక్ వేశారు. 31 పరుగులకే మూడు కీలక వికెట్లు పడిన దశలో.. సూర్య కుమార్ యాదవ్(50 నాటౌట్) పట్టువదలని విక్రమార్కుడిలా క్రీజులో నిలబడ్డాడు. వీరోచిత అర్ధ సెంచరీ బాదడు. ఐపీఎల్ హీరో శివం దూబే(37 నాటౌట్) సైతం తన సహజ శైలికి భిన్నంగా ఓపికగా ఆడి జట్టును గెలుపు తోవ తొక్కించారు.

### రేషన్ కార్డుతో ఆధార్ అనుసంధానం

# గడువు పెంపు




**విశ్వంభర, ఢిల్లీ:**

ఆధార్‌రేషన్ కార్డు లింక్ చేయని వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మరో అవకాశంగా అందుకు సంబంధించిన గడువును ప్రభుత్వం మూడు నెలలు పొడిగించింది. ఇంతకుముందు రేషన్ కార్డును ఆధార్ కార్డుతో లింక్ చేయడానికి చివరి తేదీ జూన్ 30, 2024 వరకు ఉండగా, దానిని సెప్టెంబర్ 30 వరకు పెంచింది. దీనికి సంబంధించి ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ తాజా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రేషన్ కార్డులను ఆధార్ అనుసంధానం చేయడం ద్వారా అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, అర్హులైన వారికి మాత్రమే ఆహార ధాన్యాలను అందించడం సులభం అవుతుంది. నకిలీ రేషన్ కార్డులు కూడా చాలా వరకు తగ్గి ప్రభుత్వానికి ప్రజా పంపిణీపై చేస్తున్న ఖర్చులు కూడా తగ్గుతాయి. ఫిబ్రవరి 2017లో, పీడీఎస్ కింద ప్రయోజనాలను పొందేందుకు ప్రభుత్వం రేషన్ కార్డును ఆధార్ కార్డుతో లింక్ చేయడాన్ని తప్పనిసరి చేసింది. దీనికి సంబంధించిన గడువును పలుమార్లు పొడిగిస్తూ వస్తుంది. తాజాగా మరోసారి అవకాశం ఇవ్వడానికి ఆధార్‌రేషన్ కార్డు లింక్ తేదీని పొడిగించింది. ఇప్పటికే చాలా మంది ఈ ప్రక్రియను పూర్తి చేశారు. 99.8 శాతం రేషన్ కార్డులు ఆధార్ నంబర్‌తో అనుసంధానించబడినట్లు మోదీ ప్రభుత్వం గత ఏడాది లోక్‌సభలో ఇచ్చిన సమాధానంలో పేర్కొంది. తక్కువ సంఖ్యలో మాత్రమే ఆధార్‌రేషన్ కార్డు లింక్ చేయని వారు ఉన్నారు, వారి కోసం ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. చివరి తేదీ లోపు ఈ పనిని పూర్తి చేయకపోతే సబ్సిడీ ఆహార పదార్థాలు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందలేరు. ఆధార్‌ను లింక్ చేయడానికి సమీపంలోని రేషన్ షాప్ లేదా కామన్ సర్వీస్ సెంటర్ ని సందర్శించవచ్చు లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లో కూడా పూర్తి చేయవచ్చు.



## ఐదేళ్ల గరిష్ట స్థాయికి ఉక్కు దిగుమతులు!

**విశ్వంభర, ఢిల్లీ:**

ఏప్రిల్‌తో ప్రారంభమైన కొత్త ఆర్థిక సంవత్సరం రెండు నెలల్లోనే దేశీయ డిమాండ్ కారణంగా ఉక్కు దిగుమతులు ఐదేళ్ల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. భారత్‌లో గత కొంత కాలంగా నిర్మాణ రంగాల్లో వేగం పుంజుకోవడం, కొత్త ప్రాజెక్టులు రానుండటంతో ఉక్కుకు డిమాండ్ పెరిగింది. దీంతో అవరాల కోసం ఇతర దేశాలపై ఆధార పడక తప్పలేదు. భారత్ ఏప్రిల్‌మే మధ్యకాలంలో 1.1 మిలియన్ మెట్రిక్ టన్నుల ఫినిష్డ్ స్టీల్‌ను దిగుమతి చేసుకుంది, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 19.8 శాతం పెరగడం గమనార్హం. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ముడి ఉక్కు ఉత్పత్తిదారు అయిన భారతదేశంలో ఉక్కుకు బలమైన డిమాండ్ నెలకొంది. ఇటీవలి నెలల్లో దక్షిణ కొరియాతో పాటుగా చైనా భారతదేశానికి ఉక్కును ఎగుమతి చేసే దేశాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. అయితే టాటా స్టీల్ వంటి ప్రధాన భారతీయ ఉక్కు ఉత్పత్తి దారులు చైనా దిగుమతులు పెరుగుతున్న నేపథ్యంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశం నుంచి ఫినిష్డ్ స్టీల్ ఎగుమతులు కనీసం ఆరేళ్లలో కనిష్ట స్థాయికి పడిపోయాయి. ఏప్రిల్‌మే మధ్య ఉక్కు విదేశీ ఎగుమతులు 0.9 మిలియన్ టన్నులు, సంవత్సరానికి 39.6 శాతం తగ్గాయి. ముడి ఉక్కు ఉత్పత్తి దేశీయంగా 24.6 మిలియన్ టన్నులు, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 4.9 శాతం పెరిగింది. వేగవంతమైన ఆర్థిక వృద్ధి, అధిక మౌలిక సదుపాయాల వ్యయం భారతదేశాన్ని ప్రపంచ ఉక్కు తయారీదారులకు లాభదాయకమైన మార్కెట్‌గా మార్చాయి, ముఖ్యంగా యూరప్,యునైటెడ్ స్టేట్స్‌లో ఉక్కు డిమాండ్ మందగించగా, భారత్‌లో మాత్రం డిమాండ్ నెలకొనడం ద్వారా ఇతర దేశాల ఉక్కు తయారీ కంపెనీల చూపు భారత్ వైపు పడింది.

### లాభాల్లో ముగిసిన

# స్టాక్ మార్కెట్లు




**విశ్వంభర, ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్‌లు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల నిర్ణయంతో పాటు మే నెల సీపీఐ ఆధారిత ద్రవ్యోల్బణ డేటా కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూడడంతో భారత ఈక్విటీ మార్కెట్లు నిన్న స్వల్ప శ్రేణిలోనే కొనసాగాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 150 పాయింట్లు లేదా 0.2 శాతం పెరిగి 76,607 వద్ద ముగిసింది. నిఫ్టీ 50.58 పాయింట్లు లేదా 0.25 శాతం పెరిగి 23,323 వద్ద ముగియగా అంతకు ముందు 23,442 పాయింట్ల రికార్ట్ హైని తాకింది. కోల్ ఇండియా, పవర్ గ్రిడ్, ఐషర్ మోటార్స్, ఎస్‌బీఐ లైఫ్, టెక్ మహీంద్రా, ఎల్టీఐ మైండ్ ట్రీ, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, బీపీసీఎల్ షేర్లు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. బ్రిటానియా ఇండస్ట్రీస్, ఎంఅండ్ఎం, హెచ్ యూఎల్, టైటాన్, టాటా కన్జ్యూమర్, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

# రూ. 50 వేల కోట్ల లాభం పొందించిన జెరోధా

**విశ్వంభర, ముంబై:**

జెరోధా వంటి కొత్త అధునాతన ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు ప్రజలు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడాన్ని సులభతరం చేశాయి. దీని తరువాత దేశంలో ఇలాంటి అనేక ప్లాట్‌ఫారమ్‌లు వెలుగులోకి వచ్చాయి. కోవిడ్ తర్వాత స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి, రాబడుల ధోరణిలో అనూహ్యమైన మార్పులు కనిపించాయి. తన ప్లాట్ ఫామ్ కు సంబంధించిన కథనాన్ని జెరోధా వ్యవస్థాపకుడు నితిన్ కామత్ పంచుకున్నారు. జెరోధా వ్యవస్థాపకుడు నితిన్‌కామత్ తన ప్లాట్‌ఫారమ్‌లో అందుబాటులో ఉన్న డీమ్యాట్ ఖాతాలలో ఇప్పుడు మొత్తం 4.5 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టినట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'X'లో షేర్ చేశారు. అంటే జెరోధా ఇప్పుడు రూ.4.5 లక్షల కోట్ల అసెట్ మేనేజ్‌మెంట్ (ఏయూఎం) కంపెనీగా మారింది. జెరోధా వేదికపై ఈక్విటీ ఇన్వెస్టర్లు గత నాలుగేళ్లలో రూ.50,000 కోట్ల లాభాన్ని ఆర్జించారని జెరోధా వ్యవస్థాపకుడు నితిన్ కామత్ చెప్పారు. ఇది మాత్రమే కాదు, దాని ప్లాట్‌ఫారమ్‌లో రూ. 4.5 లక్షల కోట్ల అసెట్ మేనేజ్‌మెంట్ తో పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లు ప్రస్తుతం రూ. 1,00,000 కోట్ల లాభంతో ఉన్నారని పేర్కొన్నారు. నితిన్ కామత్ చేసిన ఈ పోస్ట్ జెరోధా విజయం గురించి తెలుపుతుంది. అతను స్ట్రోక్ తర్వాత ప్రస్తుతం కోలుకుంటున్నాడని కూడా ఇది సూచిస్తుంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో, నితిన్ కామత్ తన తండ్రి చనిపోయిన దగ్గర నుండి, అతను నిద్రలేమి, అలసట, డీహైడ్రేషన్, పని భారం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నట్లు 'ఎక్స్'లో పంచుకున్నారు. అతని 'మైల్డ్ స్ట్రోక్'కి ఇది ఒక కారణం కావచ్చు. దీంతో అతడు కోలుకుంటున్నాడని, పూర్తిగా కోలుకోవడానికి 3 నుంచి 6 నెలల సమయం పడుతుందన్నారు.





# దేవకీ నందన వాసుదేవ సినిమా షూటింగ్ పూర్తి

**విశ్వంభర, సినిమా:** హీరో చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా.. తన రెండో సినిమాగా 'దేవకీ నందన వాసుదేవ' చిత్రంలో నటిస్తున్నాడు. 'గుణ 369' ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ కథను అందించాడు. వారణాసి మానస హీరోయిన్‌గా నటిస్తుంది. తాజాగా ఈ మూవీ షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలియజేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రాన్ని నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. త్వరలోనే మూవీ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయనున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు.






# వరలక్ష్మి శరత్‌కుమార్ పెళ్లికి వేళాయే!

**విశ్వంభర, సినిమా:** తెలుగు, తమిళ భాషల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న నటీమణుల్లో టాప్‌లో ఉంటుంది వరలక్ష్మి శరత్‌కుమార్. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, హీరోయిన్‌గా, నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటుంది. ఈ భామ త్వరలోనే బ్యాచిలర్ లైఫ్‌కు బై బై చెప్పబోతుందని తెలిసిందే. తన బాయ్ ఫ్రెండ్ నికోలై సచ్‌దేవ్‌ను వివాహం చేసుకోనుంది వరలక్ష్మి శరత్‌కుమార్. తాజాగా వరలక్ష్మి శరత్‌కుమార్ వెడ్డింగ్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ భామ వివాహం జులై 2 థాయ్‌లాండ్‌లో గ్రాండ్‌గా జరుగనుంది. ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖులతోపాటు లేడీ సూపర్ స్టార్ నయనతారకు ఆహ్వానం పంపింది వరలక్ష్మి శరత్‌కుమార్. ఈ డెస్టినేషన్ వెడ్డింగ్‌ను నికోలై సచ్‌దేవ్, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్లాన్ చేసినట్టు సమాచారం. శరత్‌కుమార్‌రాధిక దంపతులు వరలక్ష్మి వివాహ పనులకు సంబంధించిన ఏర్పాట్లను దగ్గరుండి చూసుకుంటున్నారట.

# టాలీవుడ్ ఇండస్ట్రీలోకి మరో స్టార్ హీరోయిన్!

విశ్వంభర, సినిమా: గత ఐదేళ్లలో టాలీవుడ్‌కు దూసుకొచ్చిన హీరోయిన్లు ఎవరు అంటే ముందుగా గుర్తుకు వచ్చే పేర్లు కృతి శెట్టి, శ్రీలీల. వీళ్ళతో పాటు చాలా మంది ముద్దుగుమ్మలు పరిచయమైనా.. వీళ్ళ స్థాయిలో ప్రభావం చూపించలేదు. తాజాగా మరో బ్యూటీ ఇదే దూకుడు చూపిస్తున్నారు. తొలి సినిమా విడుదలకు ముందే.. మూడు సినిమాలు సైన్ చేసి సంచలనం రేపుతున్నది ఆ భామ. అయితే కృతి శెట్టికి తెలుగు కంటే తమిళం, మలయాళం నుంచి ఆఫర్స్ ఎక్కువగా వస్తున్నాయి. దాంతో అక్కడే ఫోకస్ చేస్తున్నారు ఈ బ్యూటీ. మరోవైపు శ్రీలీలకు తాజాగా రవితేజ సినిమాలో ఆఫర్ వచ్చింది. ఉస్తాద్ భగత్ సింగ్ ఉన్నా అది ఎప్పుడు మొదలవుతుందో అనుమానమే. దాంతో ఈ ఇద్దరి స్థానాన్ని ఇప్పుడు భాగ్య శ్రీ బోర్సే భర్తీ చేస్తున్నారు. మిస్టర్ బచ్చన్‌తో ఈ బ్యూటీ పరిచయం అవుతున్నారు. మిస్టర్ బచ్చన్‌లో రవితేజతో జోడీ కడుతున్నారు భాగ్య శ్రీ. ఈ చిత్రం సెట్స్‌పై ఉండగానే గౌతమ్ తిన్ననూరి, విజయ్ దేవరకొండ సినిమాలో ఆఫర్ అందుకున్నారు. తాజాగా దుల్కర్ సల్మాన్‌తో జోడీ కట్టబోతున్నారు భాగ్య శ్రీ. రవి అనే కొత్త దర్శకుడితో సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మించబోతున్నారు. మొత్తానికి భాగ్య శ్రీ దూకుడు చూస్తుంటే.. మరో కృతి శెట్టి, శ్రీలీల అయ్యేలా కనిపిస్తున్నారు.





# 'కూలీ' మూవీలో మలయాళ స్టార్ నటుడు?

**విశ్వంభర, సినిమా:** కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ సౌత్ సూపర్ స్టార్ రజనీకాంత్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం 'కూలీ'. సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధిమారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. తలైవ కెరీర్‌లో ఇది 171వ సినిమా. సౌత్ ఇండియన్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఇక క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో మలయాళ నటుడు ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు ఫహద్ ఫాసిల్ ఇప్పటికే



రజనీ కాంత్‌తో 'వేటగాడు' అనే సినిమాలో నటిస్తున్నాడు. దీంతో వీరిద్దరి కాంబో 'కూలీ'లో మళ్లీ రిపీట్ అవ్వనుంది. ఇక లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన విక్రమ్ చిత్రంలో కూడా ఫహద్ ఫాసిల్ అండర్‌కవర్ ఏజెంట్‌గా నటించాడు. దీంతో కూలీలో కూడా మరో పవర్‌ఫుల్ రోల్‌లో అలరించబోతున్నట్లు తెలుస్తుంది.

# 'మట్కా కింగ్' మూవీ నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

**విశ్వంభర, సినిమా:** బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. నాని నటించిన ఎంసీఏ సినిమాతో తెలుగులో మెరిసిన ఇతడు బాలీవుడ్‌లో విలన్ గా, హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. అయితే ఈ నటుడు తాజాగా ఒక క్రేజీ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశాడు. ఆయన ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం మట్కా కింగ్. ఈ సినిమాకు సైరత్ సినిమా ఫేం బ్లాక్ బస్టర్ మరాఠీ దర్శకుడు నాగరాజు మంజులే దర్శకత్వం వహిస్తున్నాడు. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా జూన్ 12న ఈ చిత్రం నేరుగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మూవీ పోస్టర్‌తో విజయ్ వర్మ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రం ముంబై గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రానున్నట్లు చిత్ర దర్శకుడు నాగరాజు మంజులే తెలిపాడు. రాయ్ కపూర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఈ సినిమాను గార్గి కులకర్ణి, ఆశిష్ ఆర్యన్, అశ్విని సిద్వానీలతో కలిసి సిద్ధార్థ్ రాయ్ కపూర్ నాగరాజ్ మంజులే నిర్మిస్తున్నారు. కృతిక కమ్రా, సాయి తంహంకర్, గుల్షన్ గ్రోవర్ సిద్ధార్థ్ జాదవ్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.


# స్ట్రాబెర్రీలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు!

**విశ్వంభర, ఫీచర్:** రుచికరమైన, పోషకమైన పండ్లలో స్ట్రాబెర్రీలు చాలా మంది ఇష్టంగా తింటారు. అవి చాలా రుచికరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యం మెరుగుపరచడంలో కూడా సహాయపడే విస్తృత శ్రేణి ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి.

**పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు:**
స్ట్రాబెర్రీలు యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి మీ శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి, వాపు నుండి రక్షించడంలో సహాయపడతాయి. యాంటీఆక్సిడెంట్లు గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా తినడం ద్వారా, మీరు మీ యాంటీఆక్సిడెంట్ తీసుకోవడం పెంచుకోవచ్చు. అలాగే మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

**గుండె ఆరోగ్యానికి మంచిది:**
స్ట్రాబెర్రీలు విటమిన్ సి, ఫైబర్, పొటాషియం వంటి గుండెకు ఆరోగ్యకరమైన పోషకాలకు గొప్ప మూలం. ఈ పోషకాలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి, రక్తపోటును మెరుగుపరచడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. మీ ఆహారంలో స్ట్రాబెర్రీలను చేర్చడం ద్వారా, మీరు మీ గుండె ఆరోగ్యానికి తోడ్పడవచ్చు. గుండె సంబంధ సమస్యల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

**బరువు తగ్గడానికి సహాయపడుతుంది:**
బరువు తగ్గించాలని చూస్తున్నట్లయితే, మీ



బరువు తగ్గించే ప్రయాణానికి స్ట్రాబెర్రీలు గొప్పగా పనిచ్ చేస్తాయి. ఈ పండ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కానీ., ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది మీకు ఎక్కువ కాలం పూర్తిగా సంతృప్తిగా ఉండటానికి సహాయపడుతుంది. అనారోగ్యకరమైన ఆహారాలకు బదులుగా స్ట్రాబెర్రీలను తినడం ద్వారా, మీరు మీ కేలరీల తీసుకోవడం తగ్గించుకోవచ్చు. అలాగే మీ బరువు తగ్గించే లక్ష్యాలకు మద్దతు ఇవ్వవచ్చు.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది:**
స్ట్రాబెర్రీలు రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన విటమిన్ సీ తో నిండి ఉంటాయి. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా తినడం ద్వారా, మీరు మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవచ్చు. అలాగే అంటువ్యాధులు, అనారోగ్యాల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. విటమిన్ సీ కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కూడా సహాయపడుతుంది. ఇది ఆరోగ్యకరమైన చర్మం, గాయం నయం చేయడానికి అవసరం.

## జీర్ణక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది

అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా, స్ట్రాబెర్రీలు ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహించడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడతాయి. ఫైబర్ ప్రేగు కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే పేగుల్లో ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను తినిపించడం ద్వారా పేగుల ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. మీ ఆహారంలో స్ట్రాబెర్రీలను చేర్చడం ద్వారా, మీరు మీ జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు.

# పొట్ట తగ్గాలంటే ఉదయాన్నే ఈ నీళ్లు తాగాల్సిందే!

బాగా హైడ్రేటెడ్‌గా ఉండటం వల్ల మొత్తం ఆరోగ్యం మరియు బరువు తగ్గడంలో సహాయపడుతుంది. శరీర హైడ్రేషన్‌ను మెరుగుపరచడానికి ఉత్తమ మార్గం రాత్రి నానబెట్టిన నీటిని తాగడం. నిద్రకు ముందు కొన్ని ఔషధాలను నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం నిద్రలేవగానే ఖాళీ కడుపుతో తాగితే శరీరంలోని అధిక బరువు తగ్గి శరీరం ఉల్లాసంగా ఉంటుంది. బరువు తగ్గాలంటే ఎలాంటి వాటిని నీటిలో నానబెట్టి తాగాలో ఇప్పుడు చూద్దాం.



**1. నిమ్మ నీరు**
లెమన్ వాటర్ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఎందుకంటే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో నిర్విషీకరణ ప్రక్రియను ప్రోత్సహిస్తాయి, జీవక్రియను మెరుగుపరుస్తాయి మరియు బరువు తగ్గడంలో సహాయపడతాయి. ఇందుకోసం రాత్రి పడుకునే ముందు గాజు పాత్రలో నీళ్లు నింపి అందులో నిమ్మకాయ ముక్కలను వేసి రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు ఉదయం తాగాలి.

**2. దోసకాయ నీరు**
బరువు తగ్గడంలో సహాయపడే మరొక నీరు దోసకాయ నీరు. దోసకాయలో పీచుపదార్థాలు, తక్కువ క్యాలరీలు, శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచేందుకు నీరు ఎక్కువగా ఉంటాయి. ఈ దోసకాయ నీటిని తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ తొలగిపోతాయి, పొట్ట ఎక్కువసేపు నిండుగా ఉండేలా చేస్తుంది మరియు క్యాలరీలు కరిగిపోతాయి. ఈ నీటిని సిద్ధం చేయడానికి, ఒక గాజు పాత్రలో నీటితో నింపి, దానికి దోసకాయ ముక్కలను వేసి, రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు త్రాగాలి.

**3. అల్లం నీరు**
అల్లం శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంది. ఈ జింజర్ వాటర్ తాగడం వల్ల బరువు తగ్గుతారు. ఈ నీటిని సిద్ధం చేయడానికి, రాత్రి పడుకునే ముందు నీటిలో అల్లం గ్రైండ్ చేసి, రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు ఉదయం త్రాగాలి. ఈ నీటిని తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం పెరిగి, కొవ్వులు కరిగిపోయి ఆకలి తగ్గుతుంది.

**4. పుదీనా నీరు**
పుదీనా నీరు శరీరాన్ని తాజాగా ఉంచడంలో సహాయపడుతుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఈ నీటిని సిద్ధం చేయడానికి, పడుకునే ముందు గాజు పాత్రలో కొన్ని పుదీనా వేసి, నీటితో నింపి రాత్రంతా నాననివ్వండి. తర్వాత మరుసటి రోజు ఉదయం తాగండి.

**5. యాపిల్ బెరడు నీరు**
యాపిల్ బెరడు నీరు మంచి టేస్ట్ వాటర్ మాత్రమే కాకుండా త్వరగా బరువు తగ్గడానికి సహాయపడే అద్భుతమైన డ్రింక్ కూడా. ఈ నీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ మొదలైనవి పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని మెటబాలిజంను మెరుగుపరచి, రక్తంలో చక్కెర స్థాయిలను మెయింటైన్ చేయడానికి సహాయపడతాయి. ఈ నీటిని సిద్ధం చేయడానికి, ఒక గాజు కూజాలో నీటితో నింపండి, బెరడు ముక్కలు మరియు కొన్ని ఆపిల్ ముక్కలను వేసి రాత్రంతా నాననివ్వండి. తర్వాత మరుసటి రోజు ఉదయం తాగండి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com